






ముంపు మళ్లింపు



కొండవీటివాగు వరద జలాలను ఎగువ, దిగువ ప్రాంతాలకు మళ్లించే పథకం ప్లాను

రాజధాని అమరావతికి అతిపెద్ద సవాల్‌గా వరద ముంపును చిత్రీకరించారు. గత వైసీపీ ప్రభుత్వం రాజధాని అమరావతి నిర్మాణాన్ని సంక్లిష్టంగా మార్చేసింది. అమరావతికి లేని ముంపు సమస్యను భూతద్దంలో రుణదాతలకు చూపుతూ ప్రత్యర్థి పార్టీ నాయకులు కొందరు అడ్డంకులు సృష్టిస్తూనే ఉన్నారు. వాటిని అధిగమిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు తనదైన దృఢచిత్తంతో రాజధాని నిర్మాణ పనులను ముందుకే తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో వరద ముంపు సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేందుకు సుమారు రూ.3 వేల కోట్లకు పైగా వ్యయంతో రెండు దశల్లో పనులను చేపడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు హయాంలో ముంపు నివారణకు చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో కూడా తీసుకుంటున్న చర్యలతో అమరావతికి వరదముంపు నుంచి శాశ్వత రక్షణ లభించినట్లే. ప్రత్యర్థి పార్టీ కుట్రపూరిత ఆలోచనల ఫలితంగా.. అనివార్యంగా చేపట్టాల్సి వస్తున్న వరదముంపు నివారణ పనులతో అమరావతి నగరం మరింత సుందరంగా ఆకర్షణీయంగా రూపుదిద్దుకోబోతుంది.

- రాజధానిలో వరద నివారణ చర్యలు
- రూ.3 వేల కోట్లతో రెండు దశల్లో పనులు
- ప్రత్యర్థి పార్టీ నేతల కుట్రలతో పటిష్ఠ చర్యలు
- తొలిదశలో కొండవీటివాగు, పాలవాగు అభివృద్ధి
- వరద నివారణతో ఆకర్షణీయంగా అమరావతి నగరం

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)


రాజధాని అమరావతికి కృష్ణానది వరదలతో ఎటువంటి ముప్పులేదు. గత వందేళ్ల చరిత్ర చూసినా ఇది తేటతెల్లమవుతోంది. ఎగువన నదికి ఇరువైపులా కరకట్టలు ఉన్నాయి. గత టీడీపీ పాలనలో కొండవీటివాగు వరదపై అవగాహన తో అప్పటి సీఎంగా చంద్రబాబు 2018లోనే ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అమరావతిని ఉక్కుపాదంతో తొక్కేసింది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వ హయాంలో చంద్రబాబు అమరావతిపై ప్రత్యేక దృష్టి సారించారు. అయితే ప్రతిపక్ష పార్టీల పెద్దలు అమరావతికి వరదముంపు ఉందని రుణాలను ఇచ్చే సంస్థలకు పదేపదే ఫిర్యాదులను పంపుతున్నారు. ఆయా ఫిర్యాదుల నేపథ్యంలో ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు ఇస్తున్న సలహాలు, సూచనలతో కూటమి ప్రభుత్వం అమరావతిలో మరిన్ని వరద ముంపు నివారణ చర్యలను అనివార్యంగా మరింత పటిష్ఠవంతంగా చేపట్టాల్సి వచ్చింది. దీంతో కొండవీటివాగు, పాలవాగుతో పాటు గ్రావిటీ కెనాళ్ల కాల్వలను బ్రహ్మాండంగా వినియోగించుకోబోతున్నారు. దీంతో రాబోయే రోజుల్లో ప్రళయం ముంచుకొచ్చినా అమరావతికి ఎలాంటి ఢోకా ఉండబోదు.. సరికదా ప్రత్యేకంగా ఇవన్నీ అందర్నీ ఆకట్టుకుని ప్రభుత్వానికి ఆర్థికంగా లాభదాయకంగా మారనున్నాయి. సుందరమైన జలాశయాలు, గ్రావిటీ కెనాల్స్ నిర్మాణ పనులతో నగరమంతా బ్లూగ్రీన్ సిటీగా మారబోతుంది.

రెండు భాగాలుగా విభజన.. రెండు దశల్లో పనులు

అమరావతి నగరాన్ని కొండవీటి వాగు ఎగువ పరీవాహక ప్రాంతం, దిగువ పరీవాహకప్రాంతమనే రెండు భాగాలుగా విభజించి రెండు దశలుగా వరద ముంపు నివారణ చర్యలను చేపట్టనున్నారు. రెండు దశల పనులను సమగ్రంగా చేపడితే ప్రపంచంలోనే అమరావతి అత్యంత సురక్షిత ప్రదేశంగా నిలిచిపోతుంది. పైగా ఆరు రిజర్వాయర్ల ఏర్పాటుతో నగర ప్రజల తాగునీటి అవసరాలు కూడా పుష్కలంగా తీరుతాయి. ముంపు నివారణ చర్యలను ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు అందజేస్తున్న రుణం నుంచి చేపడుతున్నారు. ఈ మొత్తం వ్యవస్థను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక యంత్రాగాన్ని ఏర్పాటు చేసింది. ఈ యంత్రాంగం విప త్తుల నిర్వహణ సంస్థతో సమ న్వయం చేసుకుంటూ వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రిజర్వాయర్లలో హెచ్చుతగ్గులను నియంత్రిస్తూ ఎత్తిపోతల పథకాలను అవసరాన్ని బట్టి వినియో గిస్తుంటాయి. తద్వారా రాజధాని అమరావతిలో వరదలు తలెత్త కుండా చర్యలు తీసుకుంటారు.

- మొదటి దశలో కొండవీటివాగు దిగువ పరీవాహక ప్రాంతంలో నివారణ పథకం పనులను చేపట్టను న్నారు. ఈ పథకం తొలినుంచి అనుకుందే అయినా తాజాగా దీనిని మరింత విస్తృతస్థాయిలో చేపట్టనున్నారు. తొలిదశ పనుల కింద చేపట్టేందుకు అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీఎల్) గత జనవరిలో టెండర్లను ఆహ్వానించింది. కొండవీటివాగు, పాలవాగు విస్తరణ, శాఖమూరు రిజర్వాయర్ నిర్మాణానికి రూ.462.26 కోట్ల వ్యయంగా అంచనా వేస్తూ ఒక టెండర్‌ను పిలిచారు. గ్రావిటీ కెనాల్, కృష్ణాయపాలెం రిజర్వాయర్ నిర్మాణానికి రూ.303.73 కోట్ల వ్యయంగా అంచనా వేస్తూ మరో టెండర్‌ను ఆహ్వానించారు. నీరుకొండ రిజర్వాయర్ నిమిత్తం రూ.470.75 కోట్ల అంచనాతో మరో టెండర్‌ను పిలిచారు. ఉండవల్లి వద్ద ప్రస్తుతం ఉన్న ఎత్తిపోతల పథకం పక్కనే కొత్తగా 7360 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసేందుకు మరో ఎత్తిపోతలను కూడా నిర్మించాలని ప్రపంచబ్యాంకు చేసిన సూచనను కూడా పరిగణనలోకి తీసుకుని డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్నారు. దీనికి సుమారు రూ.300 కోట్లకు పైగా ఖర్చయ్యే అవకాశం ఉంది.
- అనంతవరం నుంచి వయా శాఖమూరు, నీరుకొండ, కృష్ణాయపాలెం రిజర్వాయర్ల మీదగా ఉండవల్లి వరకు 23.6 కిలోమీటర్ల పొడవున్న కొండవీటివాగును, బోరుపాలెం నుంచి కొండమరాజుపాలెం మీదగా కృష్ణాయపాలెం రిజర్వాయర్ వరకు ఉన్న పాలవాగును లోతు చేసి విస్తరించనున్నారు.
- కొత్తగా నెక్కల్లు నుంచి తుళ్లూరు, అనంతవరం, పిచ్చుకలపాలెం వరకు ఎనిమిది కిలోమీటర్ల పొడవునా గ్రావిటీ కెనాల్‌ను ఏర్పాటుచేయనున్నారు.
- రెండోదశలో కొండవీడు కొండల నుంచి వచ్చే వరద నీటిలో కొంత భాగాన్ని లాం వద్ద నుంచి పెదపరిమి మీదగా వైకుంఠపురం వైపు దారిమళ్లించనున్నారు. ఇందుకోసం లాం, పెదపరిమి, వైకుంఠపురంల వద్ద మూడు వేర్వేరు రిజర్వాయర్లను నిర్మించనున్నారు. వీటిని అనుసంధానిస్తూ గ్రావిటీ కెనాల్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. అవసరమైతే ఈ కెనాల్‌పై మినీ ఎత్తిపోతల పథకాలను మూడింటిని ఏర్పాటుచేసేలా డిజైన్ చేస్తున్నారు.
- చివరగా వైకుంఠపురం రిజర్వాయర్ నుంచి కృష్ణానదిలోకి మిగులు వరద జలాలను ఎత్తిపోసేందుకు 5650 క్యూసెక్కుల సామర్థ్యంతో భారీ ఎత్తిపోతలను ఏర్పాటు చేయనున్నారు.

> శాఖమూరులో 50 ఎకరాల విస్తీర్ణంలో 0.03 టీఎంసీల నీటిని నిల్వ చేసేలా, నీరుకొండలో 440 ఎకరాల్లో 0.43 టీఎంసీల నీటిని నిల్వచేసేలా, కృష్ణాయపాలెంలో 190 ఎకరాల్లో 0.09 టీఎంసీల నీటిని నిల్వచేసేలా చెరువులను నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు.



కొండవీటివాగు మొత్తం పరివాహక ప్రాంతం

వేసవి కార్యచరణకు.. రూ.9.29 కోట్లు

- ప్రభుత్వానికి మున్సిపాల్టీల ప్రతిపాదనలు
- ట్యాంకర్ల ద్వారా పట్టణాల్లో నీటి సరఫరాకు ఏర్పాట్లు
- ప్రభుత్వం నుంచి నిధుల కోసం పురపాలకుల ఎదురుచూపు
- పల్నాడు జిల్లాలో పలు మున్సిపాల్టీల్లో రెండు రోజులకు ఒకసారే తాగునీరు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎండలు మండుతున్నాయి.. పట్టణ ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. మున్సిపల్ కేంద్రాల్లో తాగునీటి సరఫరా కష్టంగా మారి ప్రజలు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. పట్టణాల్లో నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించేందుకు వేసవి కార్యచరణతో మున్సిపాలిటీలు సిద్ధమయ్యాయి. తాగునీటి ఎద్దడి సమస్య పరిష్కారానికి అవసరమైన పురపాలకులు ప్రణాళికలు రూపొందించారు. గతంలో నీటి ఎద్దడి నెలకొన్న ప్రాంతాలను గుర్తించారు. ఆ ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నారు. తాగునీటి పథకాల మరమ్మతులకు సిద్ధమయ్యారు. వేసవి ప్రణాళిక అమలుకు రూ.9.29 కోట్లు అవసరమని మున్సిపాల్టీలు ప్రభుత్వానికి ప్రతిపాదలను పంపాయి. అయితే ఈ ప్రతిపాదనలపై ప్రభుత్వం ఇంకా స్పందించలేదని అధికారులు చెబుతున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని మున్సిపాల్టీల్లో ప్రస్తుత నీటి సరఫరా, వేసవి లో తలెత్తే సమస్యలను అధికారులు గుర్తిం చారు. వేసవిలో వినుకొండ, చిలకలూరిపేట, మాచర్ల, గురజాల పట్టణాలు ఏటా తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. ప్రస్తుతం ఆయా పట్టణాల్లో పూర్తిస్థాయిలో నీటి సర ఫరా జరగడంలేదు. ఈ పట్టణాల్లో రెండు రోజులకు ఒక సారి నీటి సరఫరా చేస్తున్నారు. మూడు జిల్లాల్లో ఒక్క నరసరావుపేటలో మాత్రమే రోజూ రెండు పూటల పుష్కలంగా నీటి సరఫరా జరుగుతోంది. మంగళగిరి, తాడేపల్లి, అద్దంకి, చీరాల, బాపట్ల రేపల్లె మున్సిపాల్టీల్లో రోజూ నీటి సరఫరా జరుగుతోంది. గుంటూరు, తెనాలి, పొన్నూరు, సత్తెనపల్లి మున్సిపాల్టీల్లో రోజూ ఒక పూట నీటి సరఫరా చేస్తున్నారు. గురజాల మున్సిపాల్టీలో 69 రోజులకు, చిలకలూరిపేటలో 79 రోజులు, వినుకొండలో 67 రోజులకు సరిపడా నీటి నిల్వలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఇప్పటి నుంచే నీటి ఎద్దడి నివారణకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, పైపులైన్ల తదితర మరమ్మతుల కోసం ప్రతిపాదించారు. ప్రభుత్వం నుంచి నిధుల విడుదల కోసం పురపాలకులు ఎదురుచూస్తున్నారు. చిలకలూరిపేట మున్సిపాల్టీలో రూ.1.15 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించగా అందులో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు రూ.30 లక్షలు అవసరమని పేర్కొన్నారు.

ప్రతిపాదనలు ఇలా..

మున్సిపాల్టీ	నిధులు
పల్నాడు జిల్లా	
నరసరావుపేట	రూ.1.62 కోట్లు
చిలకలూరిపేట	రూ.1.15 కోట్లు
వినుకొండ	రూ.70 లక్షలు
మాచర్ల	రూ.1.19 కోట్లు
గురజాల	రూ.30 లక్షలు
దాచేపల్లి	రూ.40 లక్షలు
పిడుగురాళ్ల	రూ.30 లక్షలు
సత్తెనపల్లి	రూ.15 లక్షలు
గుంటూరు జిల్లా	
పొన్నూరు	రూ.44 లక్షలు
తెనాలి	రూ.52.50 లక్షలు
మంగళగిరి-తాడేపల్లి	రూ.80 లక్షలు
బాపట్ల జిల్లా	
బాపట్ల	రూ.25 లక్షలు
అద్దంకి	రూ.21.50 లక్షలు
చీరాల	రూ.37 లక్షలు
రేపల్లె	రూ.88 లక్షలు

ముందస్తుగా మేల్కోవాలి..

ఈ ఏడాది నాగార్జునసాగర్ జలాశయంలో నీటి నిల్వలు నిండుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో పురపాలకులు ముందుస్తుగా మేల్కోవాలి. ఈ నెలాఖరు వరకు కాల్వల కు నీట సరఫరా జరగనుంది. దీంతో మున్సిపాల్టీల చెరువులను పూర్తిస్థాయిలో నింపేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టకుంటే పట్టణ ప్రజలగొంతెండటం ఖాయం.



- కల్తీకారం తయారీకి సిద్ధంగా ఉన్న నాసిరకం మిర్చి

- కొండల మాటున యథేచ్ఛగా తయారీ
- ఇరవై రోజుల క్రితమే స్థానికుల ఫిర్యాదు
- కన్నెత్తి చూడని అధికారులు..
- టన్నుల కొద్దీ తరలింపు

పేరేచర్లలో కల్తీకారం కర్మాగారం

మేడికొండూరు మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు కారం అంటే ఓ బ్రాండ్. దీనిని అవకాశంగా తీసుకున్న కొందరు నాసిరకం కారం తయారీ చేసి ప్రజల ప్రాణాలను హరిస్తున్నారు. మిరపకాయల తొడిమలు, రంగు మారిన కాయలు, వాటి విత్తనాలతో పొడిని తయారుచేసి దానికి రంగు, రసాయనాలు కలిపి నాణ్యమైన కారాన్ని తలదన్నేలా కల్తీకారాన్ని తయారు చేసి టన్నుల కొద్దీ తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్కడో మారుమూల ప్రాంతంలో కల్తీ కారం తయారవుతుంది. అధికారులు తెలుసుకోలేరు అనుకుంటే పప్పులో కాలేసినట్లే. గుంటూరు నగరానికి సమీపంలో మేడికొండూరు మండలం పేరేచర్ల కొండ ప్రాంతంలోనే కల్తీకారం కర్మాగారం ఏర్పాటు చేశారు. గుంటూరులోని కొన్ని పరిశ్రమల్లో మిర్చి కాయల నుంచి వేరు చేసిన తొడిమలను సేకరించి ఇక్కడకు చేరుస్తున్నారు. రాత్రి వేళల్లో భారీ యంత్రాలను ఉపయోగించి పనికిరాని కాయలను, తొడిమలను యంత్రాల్లో వేసి పొడిగా తయారు చేస్తున్నారు. ఆ పొడికి రసాయనాలు, వెల్లుల్లి వేస్ట్, సన్‌ఫ్లవర్ ఆయిల్ వంటివి కలిపి స్వచ్ఛమైన కారంగా, చూడటానికి ఎంతో నాణ్యంగా కనిపించేలా తయారు చేస్తున్నారు. గన్నీ బ్యాగులలో ఈ కారాన్ని గుంటూరులోని గోడౌన్లకు తరలించి అక్కడ కేజీ నుంచి వంద గ్రాములు ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. కొన్ని కంపెనీల బ్రాండ్ల పేరుతో కూడా ఈ కారాన్ని ప్యాక్ చేసి మరీ అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ కల్తీ కారం గుంటూరు సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు తెలంగాణకు తరలిస్తున్నారు. తక్కువ ధరకు వస్తుండటంతో ఆయా ప్రాంతాల్లోని హోటళ్లు, కర్రీ పాయింట్లలో వినియోగంతో పాటు చిల్లర దుకాణాల్లోనూ విక్రయిస్తున్నారు. కల్తీకారం ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్నా సంబంధిత కల్తీ నిరోధక శాఖ అధికారులు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

నాసిరకం విత్తనాలు...

ఇక్కడ కల్తీ కారంతో పాటు నాసిరకం విత్తనాలు కూడా తీస్తున్నారు. కొన్ని రకాల మిర్చి కాయలను ఎంపిక చేసుకుని యంత్రాల ద్వారా విత్తనాలను తీస్తున్నారు. ఈ విత్తనాలకు కొంత మంచి విత్తనాలను కలిపి రైతులకు విక్రయిస్తారని సమాచారం. విత్తనాలు తీయగా మిగిలిన కాయలను, తొడిమలను పొడిగా చేసి కారం తయారీకి వినియోగిస్తున్నారు.

కళ్ల మంటలతో అల్లాడుతున్న ప్రజలు

మిర్చి తొడిమలను పొడిగా చేయాలంటే విపరీతంగా కోరు వస్తుంది. దీంతో కొండల మధ్య జనసంచారం లేని ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని కర్మాగారం ఏర్పాటు చేశారు. కొండల ప్రాంతంలో జనసంచారం లేని ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని ఏపుగా పెరిగిన చెట్ల మధ్య భారీ యంత్రాలను ఏర్పాటు చేసి కారం తయారు చేస్తున్నారు. సాయంత్రం 6 గంటలకు మొదలుపెట్టి ఉదయం 6లోపు ముగిస్తున్నారు. అప్పటి వరకు తయారు చేసిన కల్తీకారాన్ని మినీ లారీలలో లోడ్ చేసి గుంటూరులోని గోడౌన్లకు తరలిస్తున్నారు. తెల్లవారగానే జనరేటర్లు, యంత్రాలపై పట్టాలు కప్పి ఏమీ తెలియనట్లు వెళ్లిపోతున్నారు. ఆరు గంటల తర్వాత పేరేచర్ల గ్రామ ప్రజలకు కళ్ల మంటలు వస్తున్నాయి. తొలుత ఈ కళ్లమంటలకు కారణం తెలియక అయోమయంలో పడ్డారు. ఇటీవల కొందరు గ్రామస్తులు కొండల ప్రాంతంలో పరిశీలించగా మిర్చి బస్తాలు, తొడిమలు, పట్టాలు కప్పి ఉన్న యంత్రాలను గుర్తించారు. ఇరవై రోజుల క్రితం దీనిపై మేడికొండూ రు పోలీసులతో పాటు పంచాయతీ కార్యాలయం లో నూ ఫిర్యాదు చేశారు. అయితే ఇప్పటి వరకు ఆయా అధికారులు స్పందించలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.22 (ఆదివారం)
సహరి : 5.04 (సోమవారం)

మహిళల ఉన్నతే ప్రభుత్వ లక్ష్యం

- ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలి
- మహిళా దినోత్సవ సభలో మంత్రి గొట్టిపాటి రవికుమార్

నరసరావుపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ మహిళల సాధికారత, బలోపేతానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో వృద్ధి సాధిస్తున్నారన్నారు. మహిళల సాధికారత కోసం సీఎం చంద్రబాబు స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేశారన్నారు. చంద్రబాబు తీసుకొచ్చిన ఐటీ విప్లవంతో మహిళలు పురుషులతో సమానంగా సంపాదిస్తున్నారన్నారు. మహిళలు గౌరవంగా జీవించే హక్కును డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించగా, ఎన్టీఆర్ ఆస్తిలో హక్కుతో పాటు రాజకీయంగా పురుషులతో సమాన హక్కులు కల్పించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని గొట్టిపాటి కోరారు. సభలో మహిళా అధికారులను, పలువురు మహిళలను సత్కరించారు. డ్వాక్రా సంఘాలకు చెక్కులు, ఆటోలను పంపిణీ చేశారు. సభలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ప్రత్తిపాటి పుల్లారావు, జూలకంటి బ్రహ్మారెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జేసీ సూరజ్, తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేటలో మహిళల ర్యాలీ

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నరసరావుపేటలో మహిళలు ప్రదర్శన నిర్వహించారు. స్టేషన్‌రోడ్డు గాంధీ పార్కు వద్ద ప్రదర్శనను కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు ప్రారంభించి పాల్గొన్నారు. ర్యాలీలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కలెక్టరేట్ వరకు ప్రదర్శన సాగింది.



ర్యాలీలో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు, జేసీ సూరజ్



మహిళలను సత్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు

నవ్య కుటుంబ కదంబం ఆదివారం



ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
అమెరికన్ మ్యాన్‌హంట్	డాక్యు సిరీస్	మార్చి 10
అమెజాన్ ప్రైమ్		
వీల్ ఆఫ్ టైమ్ 3	వెబ్‌సిరీస్	మార్చి 13
బీ హ్యాపీ	హిందీ చిత్రం	మార్చి 14
జీ5		
ఇన్ గలియోంమే	హిందీ చిత్రం	మార్చి 14
ఆపిల్ టీవీ ప్లస్		
డోప్ థీఫ్	వెబ్‌సిరీస్	మార్చి 14
ఈటీవి విన్		
పరాక్రమం	తెలుగు చిత్రం	మార్చి 13
రామం రాఘవం	తెలుగు చిత్రం	మార్చి 14
సోనీ లివ్		
ఏజెంట్	తెలుగు చిత్రం	మార్చి 14

కూతురు కోసం తండ్రి తపన

దేశంలోని అతిపెద్ద డ్యాన్స్ రియాలిటీ షోలో ప్రదర్శన ఇవ్వాలన్న కూతురి కోరికను తీర్చేందుకు ఓ తండ్రి చేసిన ప్రయత్నాల నేపథ్యంలో సాగే హిందీ చిత్రం 'బీ హ్యాపీ'. అభిషేక్‌బచ్చన్ శివ అనే అంకిత భావం గల తండ్రి పాత్రను పోషించారు. ఇనాయత్ వర్మ ఆయన కూతురు ధార పాత్రలో కనిపించనుంది. డాన్స్ డ్రామా నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కింది. తల్లి లేని లోటు తెలియకుండా అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురి కోరికను తీర్చేందుకు తపించే తండ్రి పాత్రలో అభిషేక్ నటన ఈ సినిమాకు ప్రధానాకర్షణ అని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. తండ్రీ, కూతురు కలసి ముంబై వెళ్లడం, అక్కడ డ్యాన్స్ షోలో పాల్గొనేందుకు వారు చేసే ప్రయత్నాల్లోంచి పుట్టే వినోదం అలరిస్తుంది. ఈ చిత్రానికి రెమో డిసౌజా దర్శకత్వం వహించగా, సల్మాన్‌ఖాన్, ఇమాన్ మజూర్ నిర్మించారు.



వేసవిలో పిల్లలకు ఇవి తినిపించాలి..!

వేసవికాలంలో పిల్లలకు బలవర్థకమైన పోషకాహారం అత్యవసరం. పెరుగుతున్న ఎండవేడిని తట్టుకునేలా సమయానుసారం పిల్లలకు ఎలాంటి ఆహారం పెట్టాలో తెలుసుకుందాం.

- ఎండ వేడిమి వల్ల పిల్లల శరీరంలో నిర్జలీకరణ స్థితి ఏర్పడి వడదెబ్బ తగిలే అవకాశం ఉంటుంది. దీన్ని నివారించేందుకు తరచూ పిల్లల చేత చల్లని నీరు తాగిస్తూ ఉండాలి. ఫ్రిజ్ కంటే కుండలోని నీళ్లు ఆరోగ్యానికి మంచివి.
- మధ్యాహ్న సమయంలో పలుచని మజ్జిగ, కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు, నిమ్మరసం, రాగి జావ, బార్లీ నీళ్లు తాగించాలి. కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్‌ల జోలికి వెళ్లనీయకూడదు.
- సబ్జా గింజలు లేదా చియా గింజలను నీళ్లలో నానబెట్టి వాటిని పండ్ల రసాలు లేదా చల్లని మజ్జిగలో కలిపి పిల్లలకు తాగించవచ్చు. సగ్గుబియ్యంతో తయారు చేసే జావ కూడా వేసవి తాపాన్ని హరిస్తుంది.
- పుచ్చకాయ, కర్బూజా, బొప్పాయి, నారింజ, స్ట్రాబెర్రీ, దానిమ్మ, మామిడి లాంటి తాజా పండ్లను పిల్లలకు తినిపించాలి. కీరా ముక్కలు, తాటి ముంజలు కూడా మేలు చేస్తాయి.
- పాలకూర, టమాటా, కేరట్, బీట్‌రూట్, సొరకాయ, బీరకాయ లాంటి కూరగాయలతో చేసిన వంటలను భోజనంలో చేర్చాలి.
- తాజా కూరగాయలు, పండ్లతో సలాడ్స్, స్మూతీలు తయారు చేసి ఇస్తే పిల్లలు ఇష్టంగా తింటారు.
- ఉదయం అల్పాహారంగా ఇడ్లీ, దోశ, పెసరట్టు, పోహ లాంటి తేలికగా జీర్ణమయ్యేవాటిని తినిపించాలి. మధ్యాహ్న భోజనంలో రకరకాల కూరగాయలతో తయారు చేసిన సాంబార్, మజ్జిగ ఉండేలా చూడాలి. వీటివల్ల పిల్లలకు జీర్ణశక్తి మెరుగుపడుతుంది. శరీరంలో నీటిశాతం నిలిచి ఉంటుంది. రాత్రి భోజనంలో ఆరోగ్యకరమైన సూప్‌ని చేర్చాలి. సాధ్యమైనంతవరకూ నూనె, మసాలా పదార్థాలను పిల్లలకు పెట్టకపోవడమే మంచిది.
- సాయంకాలం పిల్లలు ఆకలి అన్నప్పుడు కొన్ని డ్రై ఫ్రూట్స్, ఖర్జూరాలు, మొలకలు, తేనె కలిపిన పండ్ల ముక్కలు తినిపించవచ్చు.





'భంభం భోలే...' అంటూ ఖంగుమని మోగే కంచుకంఠం కైలాష్ ఖేర్‌ది! 'జేజమ్మ...', 'వచ్చాడయ్యా సామి...', 'కథానాయక...' లాంటి పాటలతో తెలుగువారికి దగ్గరయిన కైలేష్ ఖేర్ 19 భాషల్లో తన గానాన్ని వినిపిస్తున్నారు. ఆయన ఆత్మకథ 'తేరీ దివానీ' ఇటీవల విడుదలయింది. ఈ నేపథ్యంలో ఆయన 'నవ్య'కు ఇచ్చిన ఇంటర్వ్యూ...

సిద్ధి లేకుండా ప్రసిద్ధి చెందలేం

చాలా మంది జీవితంలో చివరి దశలోనే ఆత్మకథలు రాస్తారు... మీరు ఇప్పుడే రాయటానికి కారణాలేమిటి?

నా ఉద్దేశంలో ప్రతి వ్యక్తి జీవితం ఒక అందమైన కథ. దీనిలో అనేక పార్శ్వాలు ఉంటాయి. ఇవి కూడా మనల్ని అభిమానించేవారికి తెలియాలి. అయితే ఈ పార్శ్వాలను ఎంత జాగ్రత్తగా, ఎంత నిబద్ధతతో వారి దగ్గరకు తీసుకువెళ్తున్నామనేది ముఖ్యం. దీనికి మాధ్యమంగా నేను పుస్తకాన్ని ఎంచుకున్నాను. ఇక నా జీవితం సంగీతంతో ముడిపడి ఉంది. అందరికీ నేను ఒక గాయకుడిగా మాత్రమే తెలుసు. చాలాకాలంగా నా అభిమానులు నా దగ్గరకు వచ్చి "మీ పాటలు మా హృదయాన్ని తాకుతాయి. మీరు మనసు పెట్టి పాడతారు. అలా పాడటానికి వెనుక ఉన్న కారణాలేమిటి?" అని అడుగుతూ ఉంటారు. వారి కోసమే 'తేరీ దివానీ' అనే ఈ పుస్తకాన్ని తీసుకువచ్చాను. ఒక సామాన్యుడు అసామాన్య కళాకారుడిగా ఎలా రూపుదిద్దుకున్నాడన్నదే ఈ పుస్తక కథ. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. ఈ పుస్తక ప్రచురణకర్తల్లో నేను కూడా ఒకడిని. ఎందుకంటే - మంచి పుస్తకాలు అందరి దగ్గరకు వెళ్లాలనేదే నా కోరిక. అందుకే 'కైలాస ఎడ్వర్‌టైజింగ్' అనే సంస్థను ఏర్పాటు చేసి 'పెంగ్విన్' సంస్థతో కలిపి ఈ పుస్తకాన్ని ప్రచురించాం.

పుస్తక రచన సమయంలో మీ అనుభవాలేమిటి?

మనం ప్రపంచాన్ని ఎలా చూస్తే అలా కనిపిస్తుంది. ఒక ఏనుగును నలుగురు అంధులు వేరు వేరుగా చూస్తారు. వారి వారి అనుభవాలు వారికి ఉంటాయి. మనం కూడా అంతే. మనకు తెలిసిందే ప్రపంచం



అనుకుంటాం. కానీ ఈ పుస్తకం రాసేటప్పుడు నాకు అనేక అనుభవాలు కలిగాయి. ఆ సమయంలో కైలాష్ కేర్ పైకి కనిపిస్తాడు. కానీ వాడి చేత రాయించేవాడు ఈశుడే! ఈ విషయం నాకు పుస్తకం రాసే సమయంలో అర్థమయింది. ఆ సమయంలో నాకు ఒక మిత్రుడు సహకరిస్తున్నాడు. ఒక రోజు మేమిద్దరం కలుసుకోవాల్సి ఉంది. కానీ తను నాకు ఫోన్ చేసి- "నేను రాలేను" అని చెప్పాడు. ఎందుకో అప్పుడు నాకు - 'క్యా సజనా... బిన్ సజనా..' అనే రెండు మాటలు అప్రయత్నంగా వచ్చాయి. ఆ మాటల నుంచి అప్రయత్నంగా పాట పుట్టుకువచ్చింది. ఆ పాటను త్వరలోనే విడుదల చేయబోతున్నాం. ఇలాంటి అనుభవాలెన్నో.

మీ ఆలోచనలు సంగీతంలో ఉంటాయా? మాటల్లో ఉంటాయా?

నేను దేన్నీ ఆలోచించను. మనసులో వచ్చిన ఆలోచనలను ఎప్పటికప్పుడు మాటల రూపంలో పెడతానంతే! మాట్లాడినప్పుడు కూడా అంతే! అందుకే నా మాటల్లో స్పష్టత ఉంటుంది. మాటలు నది మాదిరిగా ప్రవహిస్తూ ఉంటాయి.

మన దేశంలో సినిమా సంగీతానికి ఉన్న ప్రాధాన్యత దేశీయ సంగీతానికి ఉందని మీరు అనుకుంటున్నారా?

మన దేశంలో సినిమా పాటలకు ఆదరణ ఎక్కువ. కానీ దేశీ సంగీతానికి కూడా స్థానికంగా చాలా ప్రాధాన్యం ఉంటుంది. మన దేశంలో ప్రతి ప్రాంతానికి ఒకో ప్రత్యేకత ఉంది. అక్కడ ఉన్న సంగీతం ఇతరులు కూడా విన్నప్పుడు దానిలో ఉన్న గొప్పదనం అర్థమవుతుంది. నేను గత పదేళ్లుగా 'భారత్‌కా అమృత్ కలశ్' అనే రియాలిటీ షో నిర్వహిస్తున్నాను. దీనిలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారి వారి వేష భాషల్లో వచ్చి పాటలు పాడతారు. ఛానల్స్‌లో కూడా ఇలాంటి షోలు రావాలి. లేకపోతే వాళ్ల రియాలిటీ షోలకు 'ఫిల్మీ రియాలిటీ షో' అని పేరు పెట్టుకోవాలి.

> **మీతో కలిసి ఆల్బమ్స్ చేయటానికి చాలామంది ఔత్సాహికులు వస్తూ ఉంటారు.. వారికి మీరు ఇచ్చే సలహా ఏమిటి?**
>
> సిద్ధి లేకుండా ప్రసిద్ధి చెందలేం. అంటే చాలా కష్టం తర్వాతే విజయం లభిస్తుంది. దానివల్ల ప్రసిద్ధులమవుతాం. కానీ ఈ మధ్యకాలంలో సులభంగా ప్రసిద్ధి చెందాలనే ఆలోచన చాలామందిలో కనిపిస్తోంది. మనల్ని ఇష్టపడే అభిమానుల సంఖ్య క్రమంగా పెరగాలి. అంతేతప్ప ఒకేసారి లక్షలమంది రావాలనుకోకూడదు. ఒక పాట హిట్ అయిన వెంటనే ప్రపంచాన్ని జయించామని అనుకోకూడదు.

కైలాష్ ఖేర్ ఎప్పుడూ సనాతన ధర్మాన్ని ప్రచారం చేస్తూ కనిపిస్తారు. శుద్ధమైన హిందీలో మాట్లాడతారు. అందుకు కారణమేదైనా ఉందా?

గత కొద్దికాలంగా నేను మాట్లాడే భాషలో కూడా మార్పు వచ్చింది. ఒకప్పుడు నేను మామూలుగా మాట్లాడేవాడిని. ఇప్పుడు శుద్ధంగా మాట్లాడటం నేను నేర్చుకున్నాను. నేను పాటలు పాడటం మొదలుపెట్టినప్పుడు నాకు ఏమీ తెలీదు. సినిమా పాటలు, 'చిత్రహార్' లాంటివి తెలీదు. టీవీలో షోలు కూడాఎప్పుడూ చూడలేదు. అలాంటి నేను ఇప్పుడు 19 భాషల్లో పాడుతున్నానంటే ఏదో ఒక కారణం ఉండాలి కదా! ఆ కారణం ఆధ్యాత్మికత. నా ఉద్దేశంలో ఆధ్యాత్మికత లేకపోతే భారత దేశం లేదు. ఇంగ్లీషు సంస్కృతి నాలుగైదు వందల సంవత్సరాల క్రితం వచ్చిందే. అంతకుముందు నుంచి 'బతుకు...బతకనివ్వు' అనేది మన సంస్కృతి. 'అందరూ బావుండాలి... అందులో మనం ఉండాలి' అనేది మన సంస్కృతి. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. ప్రపంచంలో అందరూ యంత్రాలు తయారుచేస్తున్న సమయంలో మనం మంత్రాలు జపించేవాళ్లం. వాళ్లు యంత్రాలు తయారుచేసి పిచ్చి వాళ్లు అయిపోయారు. ఇప్పుడు వారు మానసిక ప్రశాంతత కోసం మన దగ్గరకు వస్తారు. అంటే మన సంస్కృతి అంత గొప్పది. అలాంటి భావనను నేను ఎప్పుడూ వదలను. కైలాష్ కేర్ ఎప్పుడూ మారడు. ఆధ్యాత్మికతను వదలడు.

● సివిఎల్ఎన్ ప్రసాద్



కథానాయకుడు బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ వెండితెర ఆరంగేట్రం కోసం నందమూరి అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు. 2024లో వారి ఎదురుచూపులు ఫలించాయి. 'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా దర్శకుడిగా మారిన ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించే ఓ చిత్రం ద్వారా మోక్షజ్ఞ హీరోగా పరిచయమవ్వనున్నట్టు అధికారికంగా వెల్లడించారు.

వెండితెర ఎంట్రీ దక్కాలంటే ఆషామాషీ విషయం కాదు. అలాంటిది ఇండస్ట్రీనే ఎర్రతివాచీ వేసి ఆహ్వానిస్తే ఎలా ఉంటుంది. పరిశ్రమలో నటీనటుల వారసుల పరిచయానికి ఉండే క్రేజే వేరు. కొత్తగా వచ్చే వారసులకు తమ తల్లిదండ్రుల అభిమానుల ఆదరణ కూడా విశేషంగా ఉంటుంది. అలా వెండితెర ఎంట్రీ ఇస్తున్న కొత్త తరంపై ఓ లుక్కేద్దాం.



వారసులు వచ్చేస్తున్నారు...



ఎన్టీఆర్ నటవారసత్వాన్ని నందమూరి బాలకృష్ణ అందుకొన్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఆ కుటుంబం నుంచి మూడు తరాల నటులు ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. తాజాగా, ఆ కుటుంబం నుంచి నాలుగో తరానికి చెందిన ఇద్దరు నూతన కథానాయకులు చిత్రసీమను పలకరించనున్నారు. అందులో ఒకరు బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ కాగా, మరోకరు హరికృష్ణ మనవడు, జానకిరామ్ తనయుడు తారకరామారావు. కథానాయకుడు బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ వెండితెర ఆరంగేట్రం కోసం నందమూరి అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు. 2024లో వారి ఎదురుచూపులు ఫలించాయి. 'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా దర్శకుడిగా మారిన ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించే ఓ చిత్రం ద్వారా మోక్షజ్ఞ హీరోగా పరిచయమవ్వనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఇది ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో సూపర్ హీరో కథాంశంతో తెరకెక్కనుంది. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభం కానుంది. దీని తర్వాత తన తండ్రి బాలకృష్ణ దర్శకత్వంలో 'ఆదిత్య 999 మ్యాక్స్' చిత్రంలో మోక్షజ్ఞ నటించనున్నారు. బాలకృష్ణ కథానాయకుడిగా సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన సూపర్ హిట్ చిత్రం 'ఆదిత్య 369'కు సీక్వెల్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. అలాగే, "సార్, 'లక్కీ భాస్కర్' చిత్రాలతో సూపర్‌హిట్‌లు అందుకొన్న వెంకీ అట్లూరీ కూడా మోక్షజ్ఞ కోసం ఓ కథ తయారుచేశారట. నట వారసులను, కొత్తతరాన్ని ఇండస్ట్రీకి పరిచయం చేయడంలో ముందుంటారు దర్శకులు వైవీఎస్ చౌదరి. ఆయన దర్శకత్వంలో తెరకెక్కబోతున్న ఓ సినిమాలో జానకీరామ్ తనయుడు తారకరామారావు కథానాయకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు. ఇటీవలె ఈ సినిమాను ప్రకటించడంతో పాటు తారకరామారావు లుక్‌ను విడుదల చేశారు. ఇందులో కథానాయికగా వీణా రావు నటిస్తున్నారు. ఈ ఏడాదే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



మరో మేనల్లుడు సిద్ధం

ఘట్టమనేని కుటుంబం నుంచి తెరంగేట్రం చేసేందుకు మరో వారసుడు సిద్ధమయ్యారు. మహేశ్‌బాబు అల్లుడిగా ఇప్పటికే అశోక్ గల్లా 'హీరో' సినిమాతో పరిచయమై ప్రేక్షకులను మెప్పించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అశోక్ తమ్ముడు సిద్ధార్థ్ గల్లా కూడా సిల్వర్‌స్క్రీన్ వైపు అడుగులేస్తున్నారు. రచయిత గోపీ మోహన్ దర్శకత్వంలో ఇది తెరకెక్కనుంది. అలాగే, మహేశ్‌బాబు అన్న కుమారుడు రమేశ్‌బాబు తనయుడు కూడా వెండితెరపై అలరించేందుకు ముస్తాబవుతున్నారు.

బాలనటులుగా

మంచు కుటుంబం నుంచి మూడో తరం వారసులు వెండితెర ఎంట్రీకి రెడీ అయ్యారు. మంచు మోహన్‌బాబు, ఆయన తనయులు విష్ణు, మనోజ్ నటులుగా ఇప్పటికే ఇండస్ట్రీలో ఉన్నారు. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ఈ సినిమాతో ఆయన తనయుడు అవ్రామ్, కుమార్తెలు అరియాన, వివియాన బాలనటులుగా పరిచయం అవుతున్నారు. భారీ తారాగణంతో ముఖేశ్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఏప్రిల్ 25న విడుదల కానుంది.

డియోల్ కుటుంబం నుంచి..



'యానిమల్' సినిమాతో ఫామ్‌లోకి వచ్చారు బాబీ డియోల్. ఆయన కుమారులు ఆర్యమన్ డియోల్, ధరమ్ డియోల్ కూడా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వడానికి సుముఖంగా ఉన్నట్లు వెల్లడించారు. తెలుగులో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా 2023లో విడుదలై ఘనవిజయం సాధించిన 'బేబీ' సినిమాను ఆర్యమన్ డియోల్ హీరోగా తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో దివంగత నటుడు ఇర్ఫాన్ ఖాన్ తనయుడు బాబిల్ కూడా నటించనున్నట్లు టాక్. హీరోయిన్లుగా సారా అలీఖాన్, క్రితి శెట్టి పేర్లను పరిశీలిస్తున్నారు.

సైఫ్ నటవారసుడు



బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ వారసురాలిగా సారా అలీ ఖాన్ ఇప్పటికే సినిమాల్లో ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు సైఫ్ తనయుడు ఇబ్రహీం అలీఖాన్ హీరోగా ప్రేక్షకుల ముందుకు వచ్చారు. షౌనా గౌతమ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'నదానియాన్' చిత్రంలో నటించారు. ఇటీవలె ఈ సినిమా విడుదలైంది. ఆయన ప్రస్తుతం కునాల్ దేశ్‌ముఖ్ దర్శకత్వంలో 'దిలెర్' అనే చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో శ్రీలీల కథానాయికగా నటిస్తోంది.

మెగాఫోన్‌తో...

స్టార్ హీరోల వారసులు ఎక్కువ మంది నటులుగా మారుతుంటే.. వారికి భిన్నమైన దారిలో ప్రయాణిస్తున్న వారూ ఉన్నారు. తమిళ కథానాయకుడు విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా మెగాఫోన్ పట్టనున్నారు. సందీప్ కిషన్ హీరోగా ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.



బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్ కూడా దర్శకత్వం వైపు అడుగులేస్తున్నారు. 'బా..డ్స్ ఆఫ్ బాలీవుడ్' పేరిట నెట్‌ఫ్లిక్స్ రూపొందిస్తున్న ఈ సెటైరికల్ వెబ్ సిరీస్‌కు ఆర్యన్ ఖాన్ దర్శకుడు. ఇందులో షారుక్ ఖాన్, ఆమిర్ ఖాన్, సల్మాన్ ఖాన్ తదితరులు అతిథి పాత్రల్లో మెరవనున్నారు.

యంగ్ పవన్‌గా..

పవన్‌కల్యాణ్ తనయుడు అకీరా నందన్ వెండితెరపైకి ఎంట్రీ ఇవ్వకున్నా.. మెగా అభిమానులకు బాగా సుపరిచితమే. అప్పుడప్పుడు సోషల్ మీడియాలో అకీరా చేసే వీడియో ఎడిట్స్‌ను మెచ్చుకుని మురిసిపోతుంటారు మెగాభిమానులు. ప్రస్తుతం పవన్ కథానాయకుడిగా 'సాహో' ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో 'ఓజీ' తెరకెక్కుతోంది. ఇందులో పవన్ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌లో అకీరా మెరవనున్నట్టు టాక్.

నటించే సామర్థ్యంతో పాటు కీబోర్డ్ ప్లేయర్‌గానూ అకీరాకు ప్రవేశముంది. దీంతో ఈ సినిమాలో తమ సంగీత బృందంలో అకీరాను చేర్చుకునే ఆలోచనలో ఉన్నట్లు తమన్ తెలిపారు.



డీవీసీలో పూర్తి స్థాయి గుండె శస్త్ర చికిత్సలు



మాట్లాడుతున్న డీవీసీ హాస్పిటల్ ఎండీ ధూళిపాళ్ల జ్యోతిర్మయి

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): డీవీసీ హాస్పిటల్‌లో పూర్తి గుండె సంబంధిత శస్త్ర చికిత్సలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ధూళిపాళ్ల జ్యోతిర్మయి తెలిపారు. శనివారం వడ్లమూడి డీవీసీ హాస్పిటల్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో వైద్య బృందం, జ్యోతిర్మయి మాట్లాడుతూ డీవీసీ హాస్పిటల్ ప్రారంభించిన అనతి కాలంలోనే విస్తృత సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. 2020లో ఈసీజీ, ఎకో, డీఎంటీ వంటి వైద్య పరీక్షలతో ప్రారంభమైన కార్డియాలజీ విభాగం 2021లో చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా అత్యాధునిక క్యాథలాబ్ సమకూర్చుకున్నట్లు చెప్పారు. అతి తక్కువ సమయంలోనే 4 వేల ప్రొసీజర్‌లకు చేరువైనట్లు చెప్పారు. ప్రపంచ స్థాయి వైద్య పరికరాలను డీవీసీ హాస్పిటల్‌లో చైర్మన్ నరేంద్రకుమార్ సహకారంతో సమకూర్చామన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు తక్కువ ధరలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో డీవీసీ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం హాస్పిటల్‌లో వైద్య సేవలు అందుబాటులోకి వచ్చిన తరువాత 3 శస్త్ర చికిత్సలు ఆయూష్ హాస్పిటల్ సహకారంతో పూర్తి చేసినట్లు చెప్పారు. గుండె రక్త నాళాలల్లో పూడిక తొలగించడం, స్టంట్ అమరిక, బైపాస్ సర్జరీలు వంటి శస్త్ర చికిత్సలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. చిన్నారులకు పుట్టుకతో వచ్చే గుండె సమస్యలకు కోత లేకుండా డివైజ్ పద్ధతిలో చికిత్సలు అందిస్తున్నట్లు వివరించారు. వాల్వ్ రిప్లేస్‌మెంట్, గుండె రంధ్రాల పూడిక వంటి చికిత్సలు విజయవంతంగా పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. మెడికల్ డైరెక్టర్ డాక్టర్ చల్లగండ్ల శ్రీనివాస్, చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ డాక్టర్ కరణం నవీన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అమరేంద్ర, డాక్టర్ రామ్‌కిషోర్, డాక్టర్ సుందరరావు పాల్గొన్నారు.

27న బార్ అసోసియేషన్ ఎన్నికలు

గుంటూరు (లీగల్), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు బార్ అసోసియేషన్ 2025-26 సంవత్సరానికిగానూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు ఈ నెల 27న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ప్రస్తుత ప్రధాన కార్యదర్శి గురజాల అనూరాధ తెలిపారు. ఈ నెల 12, 13 తేదీల్లో నామినేషన్లు స్వీకరించి, పరిశీలన, ఉపసంహరణల అనంతరం ఈ నెల 18న సాయంత్రం వివిధ పోస్టులకుగానూ పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు. 27న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు పోలింగ్ నిర్వహించి అనంతరం ఓట్ల లెక్కింపు జరుపుతామని, రాత్రికే ఫలితాలు వెల్లడిస్తామని ఆమె చెప్పారు. 2004 మంది న్యాయవాదులు ఓటు హక్కు కలిగి ఉన్నారు. బార్ అసోసియేషన్ ప్రస్తుత అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించనున్నారు. ఈసారి అధ్యక్ష పదవికి చతుర్ముఖ పోరు జరుగుతుంది. యంగలశెట్టి శివసూర్యనారాయణ (బబ్లూ), మధిర నాగేశ్వరరావు, ఖాజా భరద్వాజ, నంబూరు పాములు పోటీలో ఉన్నారు.

పాపులను రక్షించే దైవకుమారుడు ఏసయ్య

- హోసన్న మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ
- నేటితో గుడారాల పండగ ముగింపు



ప్రసంగిస్తున్న చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ



పండగలో పాల్గొన్న విశ్వాసులు

అమరావతి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పాపులను రక్షించేందుకు పరలోకం నుంచి దిగివచ్చిన దైవకుమారుడు ఏసయ్య అని హోసన్న మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ తెలిపారు. అమరావతి మండలం లేమల్లె గ్రామంలోని దయాక్షేత్రంలో జరుగుతున్న 48వ గుడారాల పండగలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన దైవజనులు, విశ్వాసులను ఉద్దేశించి ప్రసంగించారు. విశ్వాసులు చేసే ప్రార్థనకు సమాధానం చెపుతారని, స్వస్థత కల్పిస్తారని తెలిపారు. ఏసయ్యను నమ్మిన వారికి సమస్యల నుంచి విముక్తి కలిగించి సంతోషం కల్గిస్తారన్నారు. పాస్టర్లు అనిల్, రాజశేఖర్, రమేష్, రాజు దేవుని వాక్యం అందించి ఏసయ్యను ప్రార్థించారు. సూర్యుని వెలుగు ప్రకాశించినట్లు ఏసయ్య కరుణ దయాక్షేత్రంలో ఉన్న ప్రతి ఒక్కరిపై ఉంటుందన్నారు. దైవజనులు ఆలపించిన భక్తిగీతాలు విశ్వాసులను తన్మయత్వంలో ముంచాయి. జయ సంకేతమా.. దయాక్షేత్రమా అనే పాటను ఆలపించి హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ, పాస్టర్ రమేష్ అందర్నీ భక్తి సాగరంలో ముంచారు. గురువారం ప్రారంభమైన గుడారాల పండగ ఆదివారంతో ముగుస్తుంది. మధ్యాహ్నం 1 గంట వరకు దైవజనుల ప్రసంగాలతో పండగ ముగుస్తుంది.

ప్రైవేటు యూనివర్సిటీలో విద్యార్థుల ఘర్షణ

తాడేపల్లి (వడ్డేశ్వరం), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలంలోని ఓ ప్రైవేటు యూనివర్సిటీలో జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమం సందర్భంగా ఇద్దరు విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. అయితే అకారణంగా మంత్రి బంధువు కుమారుడిపై పలువురు దౌర్జన్యం చేసి, కిడ్నాప్ చేయడంతో అతని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి కథనం ప్రకారం.. వాసంశెట్టి సంతోష్ అనే విద్యార్థి స్థానిక ప్రైవేటు యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్నాడు. సంతోష్ యూనివర్సిటీలో జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమానికి శుక్రవారం రాత్రి విచ్చేశాడు. ఇదే కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు కూడా విచ్చేశారు. యూనివర్సిటీలో స్టాల్స్ వద్ద ఇద్దరు విద్యార్థుల మధ్య ఘర్షణ జరగడంతో ఓ విద్యార్థి కార్యక్రమానికి వచ్చిన పూర్వ విద్యార్థులకు తనపైన ఓ విద్యార్థి ఘర్షణకు దిగాడని, ఆ విద్యార్థి గురించి చెప్పడంతో విజయవాడకు చెందిన హరి, వినోద్ మరికొందరు సదరు విద్యార్థి కోసం గాలించారు. ఈ క్రమంలో ఆ విద్యార్థి మంత్రి బంధువు కుమారుడి కారులో దూరం వెళ్లి యూనివర్సిటీ గేటు వద్ద దిగిపోయాడు. అనంతరం సంతోష్ తన కారులో వెళుతుండగా ఘర్షణకు సంబంధం ఉన్న విద్యార్థి సదరు కారులో ఉన్నాడని ఊహించి పలువురు సంతోష్ కారును వెంబడించారు. కొలనుకొండ రైల్వే గేటు వద్ద గేటు పడి కారు ఆగగానే వారు కారులో ఉన్న సంతోష్‌ను దింపి తమ కారులో ఎక్కించుకుని మెల్లెంపూడి వైపు వెళ్లి అక్కడ ఘర్షణలో ఉన్న విద్యార్థి ఎక్కడంటూ సంతోష్‌ను ప్రశ్నించి దౌర్జన్యం చేశారు. ఆ మార్గాన వస్తున్న స్థానికులను చూసి హరికృష్ణ, సుమారు ఆరుగురు పరారయ్యారు. గాయపడిన సంతోష్‌ను విజయవాడలోని వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించి పోలీసులు పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. తాడేపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా గాయపడిన సంతోష్ ఓ మంత్రి బంధువని తెలిసిందని ఎస్ఐ ఖాజావలి తెలిపారు.

కోర్కెలు తీర్చే తల్లి సాగరమాత



దైవ సందేశం అందిస్తున్న పీఠాధిపతి డాక్టర్ ఆంతోని

మాచర్ల రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): భక్తులు కోరిన కోర్కెలు తీర్చే తల్లి సాగరమాత అని నెల్లూరు సహవారస పీఠాధిపతి డాక్టర్ పల్లి ఆంతోని అన్నారు. మండలంలోని విజయపురిసౌత్‌లో గల సాగరమాత ఉత్సవాల్లో రెండో రోజైన శనివారం ఆలయంలోని జపమాల క్షేత్రంలో ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యాన జరిగిన సమష్టి దివ్యపూజాబలిలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై దైవ సందేశం అందించారు. క్రైస్తవులు ఆదర్శంగా నిలవాలన్నారు. తోటి వారిని ఆదరించడం, ప్రేమను పంచడం క్రైస్తవ్యమన్నారు. ఉదయం 5 గంటలకు గురుశ్రీ చిన్నాబత్తిని కిరణ్‌కుమార్, 6 గంటలకు తుమ్మా కరుణాకరరెడ్డి, 7 గంటలకు పామిశెట్టి బాలస్వామి, 8 గంటలకు ఆర్ రాజు, 9.30 గంటలకు రవికుమార్, 11.30 గంటలకు అల్లం చిన శౌరెడ్డిలు దివ్య బలిపూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం జరిపారు. సాయంత్రం కోలాట ప్రదర్శన నిర్వహించారు. రాత్రి కొవ్వొత్తులతో తేరు ప్రదక్షణ, సాగరమాత మహిమలు బుర్రకథ, శిలువదారి బైబిల్ నాటకం నిర్వహించారు.

డేటా ఎంట్రీ కోర్సుల్లో ఉచిత శిక్షణ

గుంటూరు (విద్య), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు డేటా ఎంట్రీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సాయి వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న వారు ఈ నెల 11లోగా పది మార్కుల జాబితా, ఆధార్, ఫొటో తదితర వివరాలతో కలెక్టరేట్ ఎదురుగా ఉన్న జిల్లా శిక్షణ కేంద్రం(ఐటీఐ)లో సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాల కోసం ఎస్‌కే మస్తాన్ ఏటీవో (9704668909)ను సంప్రదించాలని సూచించారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో విద్యార్థి మృతి



రాహుల్ గాంధీ (ఫైల్)

పెదకాకాని, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ నానో టెక్నాలజీ (ఐదేళ్ల కోర్సు) చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థి రాహుల్ గాంధీ (20) బ్రెయిన్ స్ట్రోక్‌తో శనివారం మృతి చెందారు. విద్యార్థి రాహుల్ గాంధీ ఈ నెల 7న బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. వెంటనే అతనిని వైద్య సేవలు నిమిత్తం ఆసుపత్రికి తరలించగా వైద్య సేవలు పొందుతూ మృతి చెందారు. ఏఎన్యూ ఉన్నతాధికారులు, నానో టెక్నాలజీ అధ్యాపకులు, సహచర విద్యార్థులు రాహుల్ గాంధీ మృతి పట్ల సంతాపం తెలిపారు.

వైభవంగా పల్నాటి తిరుమల తిరునాళ్ల

- వేంకటేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు
- కల్యాణ మహోత్సవాన్ని తిలకించిన భక్తులు



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



స్వామి వారిని దర్శించునేందుకు క్యూ లైన్లో భక్తులు

రాజుపాలెం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పల్నాటి తిరుమలగా పేరుగాంచిన మండలంలోని దేవరంపాడు కొండపై ఉన్న మత్స్యావతార స్వయంభువుగా వెలసిన వేంకటేశ్వరస్వామి రెండో శనివారం తిరునాళ్ల అంగరంగ వైభవంగా జరిగింది. తిరునాళ్లను పురస్కరించుకుని ఉదయం 7 గంటల నుంచే భక్తుల రాక ప్రారంభమై సాయంత్రం వరకు కొనసాగింది. రెండో శనివారం పల్నాటి తిరుమల మత్స్యావతార వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవానికి విచ్చేసిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. స్వామివారి సన్నిధిలో ఎక్కువ మంది మహిళలు పొంగళ్లు పొంగిచ్చారు. పంటలు ఇళ్లకు వచ్చిన తరువాత వచ్చే పల్నాటి తిరుమల తిరునాళ్ల కావటంతో ధాన్యాన్ని స్వామివారికి సమర్పించారు. తిరునాళ్లకు పల్నాడు జిల్లా నుంచే కాక ఉమ్మడి గుంటూరు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దాదాపు 17 వేల మంది దర్శించుకున్నట్లు ఈవో సురేష్ తెలియజేశారు. తిరునాళ్లకు సత్తెనపల్లి, గురజాల, మాచర్ల నియోజకవర్గాల నుంచి ఎక్కువ మంది ప్రజాప్రతినిధులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

హుండీ ఆదాయం రూ.10 లక్షలు

పల్నాటి తిరుమలగా పేరుగాంచిన మండలంలోని దేవరంపాడు మత్స్యావతార వేంకటేశ్వరస్వామి రెండో శనివారం హుండీ ఆదాయం రూ. 10,97,573 వచ్చినట్లు ఈవో సురేష్ తెలియజేశారు.

మహిళల అభివృద్ధి ఘనత చంద్రబాబుదే



డ్వాక్రా మహిళలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

చిలకలూరిపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళల అభివృద్ధి ఘనత చంద్రబాబుదేనని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ప్రత్తిపాటి మాట్లాడుతూ కౌన్సిలర్లలో ఎక్కువ మంది మహిళలు ఉండటం గర్వించాల్సిన విషయమనీ, సృష్టికి మూలమైన స్త్రీమూర్తులందరికీ హృదయ పూర్వక మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పురుషులతో సమానంగా రాణించాలనే సంకల్పంతో రాష్ట్ర మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుచూపుతో ఆలోచించి డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి, కుటుంబాలే మహిళలపై ఆధారపడే పరిస్థితి తీసుకొచ్చారని తెలిపారు. దేశం గర్వించే స్థాయిలో ఆంధ్రప్రదేశ్ డ్వాక్రా మహిళలు తమ పనితీరుతో ముందుకు సాగుతున్నారన్నారు. మహిళల్ని ఆర్థికంగా, సామాజికంగా అగ్రస్థానంలో నిలిపేలా, పారిశ్రామిక వేత్తలుగా వారు ఎదిగేలా చంద్రబాబు ఎంతో చొరవ తీసుకున్నారన్నారు. తెలుగు యువతులు ఐటీ సహా, అన్ని రంగాల్లో ప్రపంచస్థాయిలో రాణించడానికి కారణం చంద్రబాబు దూరదృష్టేనన్నారు. డ్వాక్రా మహిళలు తమ ఉత్పత్తుల్ని ఆన్‌లైన్లో విక్రయించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించడం అభినందించాల్సిన విషయమన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా డ్వాక్రా గ్రూపుల్ని ప్రోత్సహిస్తున్నామని, డ్వాక్రా మహిళలు కూడా రాష్ట్రాభివృద్ధికి తగిన సహాయ, సహకారాలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా డ్వాక్రా బజార్‌లో ఏర్పాటు చేసిన వివిధ రకాల వస్తువులను పరిశీలించారు. డ్వాక్రా మహిళలకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి ఎంపీ, ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తి, జనసేన ఇన్‌చార్జి తోట రాజా రమేష్, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరిబాబు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో రాజధాని రైతుల కేసులు పరిష్కారం



కోర్టుకు వచ్చిన ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్

మంగళగిరి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి కోర్టుల పరిధిలో శనివారం జరిగిన నేషనల్ లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో రాజధాని రైతులకు చెందిన ఏడు కేసులు పరిష్కారం కాగా అందులో డ్రోన్ కేసుకు సంబంధించి తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ కూడా రైతులు, జేఏసీ సభ్యులతో కోర్టుకు హాజరయ్యారు. ఇప్పటికే రాజధాని రైతులకు సంబంధించి పలు కేసులు గత లోక్ అదాలత్‌లో పరిష్కారమైన విషయం విదితమే.

లోక్ అదాలత్‌లో 292 కేసుల పరిష్కారం

మంగళగిరి కోర్టుల పరిధిలో శనివారం జరిగిన నేషనల్ లోక్ అదాలత్‌లో మొత్తం 292 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో క్రిమినల్, ఎన్ఐ యాక్టులు, సీసీలు, ఎక్సైజ్, ఎంసీ, డీవీసీ, 15 సివిల్ కేసులు ఉన్నాయి. వివిధ బ్యాంక్‌లకు సంబంధించి పలు కేసులు పరిష్కరించారు. సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో జరిగిన బెంచ్‌లో సీనియర్ సివిల్ జడ్జి ఎం అంజనీ ప్రియదర్శిని, లోక్ అదాలత్ బెంచి న్యాయవాది భారతి, అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కమ్ సివిల్ జడ్జి కోర్టులో జరిగిన లోక్ అదాలత్ బెంచ్‌లో న్యాయమూర్తి కె.సురేష్‌బాబు, లోక్ అదాలత్ బెంచి న్యాయవాది రెంటపల్లి రాజేష్ పాల్గొన్నారు. న్యాయవాదులు పాల్గొన్నారు. కాగా శనివారం రాత్రి 9 గంటల వరకు లోక్ అదాలత్ కేసుల పరిష్కారం కొనసాగింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

రోడ్డు ప్రమాదంలో హైకోర్టు ఉద్యోగి మృతి

రాజుపాలెం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో హైకోర్టు ఉద్యోగి మృతి చెందిన సంఘటన గుంటూరు-మాచర్ల రహదారిపై శనివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పిడుగురాళ్ల మండలం జూలకల్లు గ్రామానికి చెందిన జరపాల సంధ్యానాయక్(34) హైకోర్టులో ఉద్యోగం చేస్తున్నాడు. నేడు ఆదివారం సెలవు కావటంతో స్వగ్రామమైన జూలకల్లు బయల్దేరాడు మార్గమధ్యలోని రెడ్డిగూడెం గ్రామం దాటుతూ ముందుపోతున్న లారీని క్రాస్ చేస్తున్న క్రమంలో వెనుక టైర్ కింద పడ్డాడు. ఈ సంఘటనలో సంధ్యానాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై వేణుగోపాల్ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	88, 95, 105
చికెన్ విత్ స్కిన్	170.00
చికెన్ స్కిన్ లెస్	180.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

పులిచింతల సమాచారం

అచ్చంపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శనివారం 30.67 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందని రాజు తెలిపారు.

లోక్ అదాలత్‌లో 100 కేసులు పరిష్కారం

మాచర్లటౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి ప్రశాంత్ ఆధ్వర్యాన జాతీయ లోక్ అదాలత్‌లో నిర్వహించి 100 కేసులను పరిష్కరించారు. వీటిలో సివిల్ 25, క్రిమినల్ 55, ఎక్సైజ్ 12, భరణం 3,ముందస్తు రాజీ కేసులు 5 ఉన్నాయి. ఈ లోక్‌అదాలత్‌లో న్యాయవాదులు అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సత్తెనపల్లి, (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోర్టులో శనివారం నాలుగు న్యాయ స్థానాల పరిధిలో రెండు బెంచ్‌లుగా మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. న్యాయాధికారులు విజయ కుమార్‌రెడ్డి, కౌషిత్ హుస్సేన్‌ల ఆధ్వర్యంలో మొత్తం 255 కేసులు పరిష్కారమయ్యాయి. ఆర్యక్రమంలో న్యాయవాదులు, లోక్ అదాలత్ సభ్యులు పాల్గొన్నారు.

పీ- 4 సర్వే ప్రారంభం

మాచవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాను సారం కుటుంబాల ఆర్థిక స్థితిగతులు తెలుసుకొనేందుకు నిర్వహిస్తున్న పీ- 4 సర్వే మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం నుంచి ప్రారంభమైంది. పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది వారికి కేటాయించిన క్లస్టర్లలో వివరాలను తెలుసుకొని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈనెల 18వ తేదీ లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించటంతో సెలవు దినాలు అయినప్పటికీ అన్ని శాఖల అధికారులు వారి వారి గ్రామాల్లో ఉదయం నుంచే సర్వేలో నిమగ్నమయ్యారు.

సర్వే పనుల పరిశీలన..

సత్తెనపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భట్లూరు గ్రామంలో జరుగుతున్న పీ - 4 సర్వేను హౌసింగ్ ఏఈ ఆర్‌వీవీ సుబ్బారావు శనివారం పరిశీలించారు. సర్వే జరుగుతున్న తీరును గమనించి సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు.

దరఖాస్తు చేసుకోండి ..

మాచవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : బీసీ కార్పోరేషన్ ద్వారా కుట్టులో శిక్షణ ఇస్తున్నామని, అర్హులైన మహిళా లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వెంగళరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీలు, ఈడబ్ల్యూఎస్, కాపు మహిళలు బేసిక్ టైలరింగ్ ట్రైనింగ్, అనంతరం కుట్టు మిషన్‌లను అందజేస్తారన్నారు. రేషన్‌కార్డు కలిగి ఉండి, 18 నుంచి 55 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన మహిళల దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఏపీపీగా సూర్యరాజు



పిడుగురాళ్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గురజాల పదవ అదనపు జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా గురజాలకు చెందిన న్యాయవాది కందిమళ్ల సూర్యరాజును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మూడేళ్లపాటు పదవిలో వుండేలా ఉత్తర్వుల్లో పేర్కొంది. తన నియామకానికి సహకరించిన గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు సూర్యరాజు ధన్యవాదాలు తెలిపారు.

దేవాలయ భూములకు కౌలును వెంటనే చెల్లించాలి

రెంటచింతల,మార్చి 8 (ఆంధ్రజ్యోతి) :ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్రశాలలోని శ్రీగంగాభ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయ భూములను సాగు చేసుకునే రైతులు వెంటనే కౌలు చెల్లించాలని ఈవో గాదే రామిరెడ్డి శనివారం కోరారు. 92 ఎకరాలకు సంబంధించి రూ.5 లక్షల 27 వేలు రావాల్సి ఉందని తెలిపారు. డబ్బులు చెల్లించకపోవడం వలన స్వామి వారి పూజా కార్యక్రమాలు, పండుగలు నిర్వహించడానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, సకాలంలో చెల్లించాలని ఈవో గాదే రామిరెడ్డి కోరారు.

భక్తులకు అన్నదానం

పిడుగురాళ్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): దేవరంపాడు నేతివెంకన్నస్వామి 2వ శనివారం తిరునాళ్ల సందర్భంగా భక్తులకు దాతలు దియ్యా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పిడుగురాళ్లకు చెందిన అనేక మంది స్వచ్ఛంద సంస్థలు, దాతలు భక్తులకు పులిహోర, మజ్జిగ, మంచినీరు అందజేశారు. పిడుగురాళ్ల పట్టణం నుండి బాలలు కొండకు బాలప్రభను కట్టుకొని తరలివెళ్లారు.

చైర్ పర్సన్‌కి సత్కారం

సత్తెనపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్ పర్సన్ చలంచర్ల లక్ష్మీలసీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఆనంద్ కుమార్, మేనేజర్ నెట్టెం సాంబశివరావు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

10న రూపెనగుంట్ల తిరునాళ్ళ

నకరికల్లు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : రూపెనగుంట్ల అంజనేయ స్వామి తిరునాళ్ళను ఈనెల 10వ తేదీ నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. తిరునాళ్ళ ఏర్పాట్లలో భాగంగా శనివారం నకరికల్లు ఎస్ఐ చల్లా సురేష్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ప్రభల ఏర్పాటు ప్రదేశాలను, పరిశీలించి తగు ఆదేశాలను జారీ చేశారు.

మహిళలకు అందలం

అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాలను శనివారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లోనూ, అలాగే మహిళా సంఘాలు, వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో వేడుకలను వినూత్నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా రంగాల్లో రాణిస్తున్న, సేవలందిస్తున్న మహిళలను ఘనంగా సత్కరించారు.

- మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో వక్తలు
- పల్నాడు జిల్లాలో ఘనంగా వేడుకలు
- వివిధ ప్రాంతాల్లో పలువురికి సత్కారాలు



సత్తెనపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో ఎన్ఎంయూవీ ఆధ్వర్యంలో మహిళలను సన్మానించిన దృశ్యం

సత్తెనపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ సీఐ కె.పాతిమా రోశమ్మ, కండక్టర్లు బి.నాగమ్మ, రామ తులసీ, శ్రీలక్ష్మి, అరుణ, మాధవి, ఇందిర, మేరీ, రఘు కుమారి, లిల్లీ బ్యూలీ, ఇందిరా ప్రియదర్శినిలను సన్మానించారు. కార్యక్రమంలోడిపో సెక్రటరీ ఎన్.నాగేశ్వరరావు, ప్రెసిడెంట్ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఏరియా వైద్యశాలలో గైనకాలజిస్టు డాక్టర్ సుజాత, ఆర్ఎంవో శోభారాణిలను ప్రజా చైతన్య పార్టీ నేతలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు, చైతన్య భారతి సభ్యులు ప్రేమ్‌కుమార్, అంజనేయులు, మల్లేశ్వరరావు, మద్దిరాల గంగాధర్ పాల్గొన్నారు.

సత్తెనపల్లిరూరల్, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందిగామలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నందిగామపంచాయతీ ఉత్తమ మోడల్ మహిళా ఫ్రెండ్లీ గ్రామంగా ఎంపికవ్వటం అభినందనీయమన్నారు. అనంతరం గ్రీన్ అంబాసిడర్లను, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలను, ఏఎన్ఎంలను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

జడ్పీ హైస్కూల్లో విద్యనభ్యసించి హాకీలో జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యంవహించిన ధరణీ సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి, ఉప సర్పంచ్ రమేష్, ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి తదితరులు సత్కరించారు.

పెదకూరపాడు, (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని పెదకూరపాడు క్యాంపు కార్యాలయంలో మహిళలు కేక్‌ను కట్‌చేశారు. టీడీపీ జిల్లా కార్యని ర్వాహక కార్యదర్శి షేక్ ముంతాజ్ ఒక ప్రకటనలో మహిళా దినోత్సవ శుభాకాంక్షలను తెలిపారు.



పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మహిళలు

క్రోసూరు, (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో యోగా టీచర్ కంభంపాటి శ్రీలక్ష్మి, హిందీ ఉపాధ్యాయురాలు జుజ్జూరి నిర్మలాదేవిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ నాయకులు గ్రంధి విజయకుమార్, కట్టమూరి అప్పారావు, నాగేశ్వరరావు, కేశవరావు, బాబు తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట, (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేటలోని గోల్డెన్ బర్డ్ పాఠశాల హెచ్ఎం పుష్పను వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా వైస్ గవర్నర్ నూరె వెంకటకోటిలింగం, అధ్యక్షుడు బీ రవికుమార్, వనిత క్లబ్ అధ్యక్షురాలు పులిపాటి పద్మావతి, అడ్డగిరి సుశీల తదితరులు పాల్గొన్నారు.



మాచర్లలో మహిళలను సన్మానిస్తున్న బీసీ సంక్షేమ సంఘ నేతలు

మాచర్లటౌన్, (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలకు పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు జింకల నాగేశ్వరయాదవ్, సెక్రటరీ బ్యంగారమణ, బాదన్‌బాయి. శ్రీనివాసరావు, ముప్పూరి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

రెంటచింతల,(ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవం సందర్భంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ స్పీచ్ పోటీలో ఫాతిమా విద్యానికేతన్ విద్యార్థిని నూకబత్తిన అమృత వైశాలి ప్రథమ బహుమతి సాధించింది. నరసరావుపేట ఎస్పీ కార్యాలయంలో అమృత వైశాలి బహుమతి అందుకున్నట్లు పాఠశాల డైరెక్టర్ ఫాతిమా మర్రెడ్డి, హెచ్ఎం స్టెఫీ తెలిపారు.

దుర్గి,(ఆంధ్రజ్యోతి): దుర్గిలోని సాయితేజ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో మహిళా ఉపాధ్యాయులను దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హరికారెడ్డి, లీలావతి, శ్రీనివాసరావు, ప్రసాద్‌బాబు, అశోక్‌కుమార్, కె.శ్రీనివాసరావు, భవాని, ఝాన్సీ, అపర్ణ, ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

కారంపూడి, (ఆంధ్రజ్యోతి): కారంపూడి సెయింట్ జాన్స్ హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఫాదర్ అనిల్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మహిళా దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో సిస్టర్ బినోమా తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లి, (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా సిమెంట్ ఫ్యాక్టరీలో మహిళలకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దాచేపల్లిలోని ఉన్నత పాఠశాలలో, భవ్య, చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో క్లబ్ ప్రెసిడెంట్ రుక్మిణీ, వైస్ ప్రెసిడెంట్ కవిత తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల, (ఆంధ్రజ్యోతి): మెప్మా, పొదుపు సంఘం ఆధ్వర్యంలో మహిళలు సమావేశం నిర్వహించారు. జడ్పీ హైస్కూల్లో పట్టణ తెలుగు మహిళా అధ్యక్షులు చల్లగుండ్ల సీత, పర్చూరి వెంకటరమణలు పాల్గొని కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది శ్రీనివాసరావు, రాయల్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు. ఆర్టీసీ డిపోలో నేషనల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మహిళా కండెక్టర్లను సత్కరించారు. లెనిన్‌నగర్‌లోని కార్డ్స్ స్కూల్లో మహిళలకు, బాలికలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

గురజాల లీగల్, (ఆంధ్రజ్యోతి): గురజాల న్యాయవాదుల సంఘం సమావేశపు హాలులో సంఘం అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి వై.శ్రీనివాసరావు, అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు న్యాయాధికారి పి.అలేఖ్యలు పాల్గొన్నారు. ఈసందర్భంగా మహిళా న్యాయవాదులు న్యాయాధికారి అలేఖ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు హనుమంతరావు, ప్రభుదాసు, జె చెన్నకేశవరావు, వీరభద్రుడు, శ్యామలాదేవి, ఝాన్సీ, కర్రా చినకోటేశ్వరరావు, నాగలక్ష్మీ పాల్గొన్నారు.



న్యాయాధికారి అలేఖ్యను సన్మానిస్తున్న గురజాల మహిళా న్యాయవాదులు

జేసీబీతో ఇసుక క్వారీయింగ్

● ఉపాధి కోల్పోతున్న కూలీలు.. ● పట్టించుకోని అధికారులు

పెదకూరపాడు, మార్చి8 (ఆంధ్రజ్యోతి) అమరావతి మండలం మల్లాది గ్రామంలో నాలుగు రోజుల నుంచి జేసీబీతో ఇసుక క్వారీయింగ్ చేసి ట్రాక్టర్‌లకు లోడింగ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక పాలసీ విధానంలో ట్రాక్టర్లకు కూలీల సహాయంతో ఇసుకను తవ్వి లోడింగ్ చేయాల్సి ఉంది. కానీ ఇసుకను క్వారీయింగ్‌కు జేసీబీలను ఉపయోగిస్తున్నారు. ఒక్కో ట్రాక్టరు ట్రక్కుకి ఇసుకను లోడింగ్ చేసినందుకు రూ.6 వందలు వసూళ్లు చేస్తున్నారు. దీంతో కూలీలు పని కోల్పోతున్నారు. అలాగే స్థానికులు కొందరు ఇసుకను గ్రామ శివారులో డంపింగ్ చేసి అక్కడి నుంచి రాత్రివేళల్లో లారీలకు లోడింగ్ చేసి అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక నూతన పాలసీని ఇంకా ప్రకటించక పోవడంతో టీడీపీ నాయకులు కొందరు ఇసుకను ట్రాక్టర్ల ద్వారా బయటకు తరలిస్తున్నారు. గతంలో లారీలకు లోడింగ్ చేస్తుండటంతో అధికారులు అడ్డుకొని కేసులు నమోదు చేయడం జరిగింది. ప్రస్తుతం లారీలకు బదులు ట్రాక్టర్లలో ఇసుకను లోడింగ్ చేస్తున్నారు. అయితే ఇసుక క్వారీయింగ్‌ను పూర్తిగా కూలీలకు అప్పగించి ఉపాధి కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



జేసీబీ ద్వారా క్వారీయంగ్ చేస్తున్న దృశ్యం

భూములు లేకపోతే జీవనోపాది కోల్పోతాం

● పేటసన్నిగండ్ల రైతులు ● ప్రభుత్వ భూమి అప్పగించాలని నోటీసులు

కారంపూడి, మార్చి8 (ఆంధ్రజ్యోతి): భూములు లేకపోతే జీవనోపాధి కోల్పోతామని మండలంలోని పేటసన్నిగండ్ల రైతులు వాపోయారు. శనివారం మండల కేంద్రమైన కారంపూడిలో వారు టీడీపీ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మండల రెవెన్యూ అధికారులు తమ భూమి అంటూ ఐదు చోట్ల నోటీసులు అంటించారన్నారు. గ్రామంలో 800 ఎకరాలు సాగులో ఉన్నాయని, తిరిగి ప్రభుత్వానికి అప్పగించాలంటూ నోటీసులో ఉందన్నారు. ఎన్నో యేళ్లుగా సాగు చేసుకుంటున్న భూములు తిరిగి ఇచ్చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. ఈ మేరకు కలెక్టర్ అరుణబాబును కలిసి తమ సమస్యను విన్నవించినట్లు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు చప్పిడి రాము, బూసా రామాంజినేయులు, నంబూరి సైదయ్య, కొంగర లక్ష్మీనారాయణ, నేలపాటి సాంబశివరావు, గాడిపర్తి పూర్ణ, చావా వీరాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పేటసన్నిగండ్ల గ్రామ రైతులు

కలిసికట్టుగా గ్రామాల అభివృద్ధికి కృషి చేద్దాం

● అత్యవసర సమావేశంలో ఎంపీడీవో ఫణికుమార్ నాయక్

మాచర్ల రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా ఉంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీడీవో ఫణికుమార్ నాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉప ఎంపీపీ-2 పరిమల మనీషా ఆధ్వర్యాన నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణ, ఎన్ఆర్ఈజీఎస్ పనులు, 2024-2025 సవరణ, 2025-2026 అంచనా బడ్జెట్, ప్రభుత్వ శాఖల పనితీరుపై చర్చించి ఆమోదం తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో ఫణికుమార్‌నాయక్

వేసవిలో తాగు నీటి సమస్యకు పరిష్కారం

● జల్ జీవన్ పథకం కింద రూ.6 కోట్లు మంజూరు
● సర్వసభ్య సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో

దాచేపల్లి,మార్చి8(ఆంధ్రజ్యోతి):వేసవిలో గ్రామాల్లో తాగు నీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో రత్నం అధికారులను కోరారు. శనివారం దాచేపల్లి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు కందుల జాన్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా జడ్పీటీసీ సభ్యుడు మూలగుండ్ల కృష్ణకుమారి హాజరయ్యారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మాట్లాడుతూ జలజీవన్‌మిషన్ పథకంలో భాగంగా పొందుగులకు రూ.27లక్షలు, శ్రీనివాసపురానికి రూ.26లక్షలు, రామాపురా రూ.38 లక్షలు, శ్రీనగర్‌కు రూ.21 లక్షలు, గామాలపాడుకు రూ.1.10 కోట్లు, శంకరాపురానికి రూ.15 లక్షలు, భట్రుపాలెంకు రూ.60 లక్షలు, కాట్రపాడుకు రూ.15 లక్షలు, తంగెడకు రూ.1.10 కోట్లు, తక్కెళ్ళపాడుకు రూ 60 లక్షలు, పెదగార్లపాడుకు రూ.1.06 కోట్లు నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఆయా నిధులతో గ్రామాల్లో తాగు నీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. జలజీవన్ మిషన్‌తో ప్రతి ఇంటికి తాగు నీరు అందుతుందన్నారు. మాదినపాడు, కొత్తూరు, కేసానుపల్లిలకు నిధులు మంజూరైనా టెండర్లు వేసేందుకు ఎవ్వరూ ముందుకు రాకపోవటంతో జల జీవన్ పథకం వర్తించలేదన్నారు. సారంగిపల్లి అగ్రహారంలో తాగు నీటి సమస్య ఎక్కువగా ఉండటంతో మండల పరిషత్ గ్రాంటు నుంచి రూ.1.50 లక్షలు మంచి నీటి బోర్లు, మోటారు ఏర్పాటు చేసేందుకు తీర్మానం చేశారు. అనంతరం వివిధ అంశాలను ప్రస్తావించారు. సమావేశంలో డాక్టర్ అమూల్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సోమయ్య, ఇరిగేషన్, పంచాయతీరాజ్ అధికారులు, ఎంపీటీసీలు గ్రామ సర్పంచ్‌లు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సోమయ్య, వేదికపై ఇన్‌చార్జి ఎంపీడీవో రత్నం

స్కిల్ హబ్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

● నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోండి : కో-ఆర్డినేటర్ అంజిరెడ్డి

కోసూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో స్కిల్ హబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణా కేంద్రంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి కల్పన కల్పించనున్నట్లు కో-ఆర్డినేటర్ బాపతు అంజిరెడ్డి తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటీవ్ డొమెస్టిక్ వాయిస్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 45నుంచి 50 రోజుల పాటు జరిగే శిక్షణా కార్యక్రమానికి 10వ తరగతి నుంచి డిగ్రీ, డిప్లమో విద్యార్హత గల 18 నుంచి 45 సంవత్సరాల లోపు వారందరూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు జారీ చేసి, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. వివరాల కోసం 7779858789 నెంబరులో సంప్రదించాలని కోరారు.

కన్నుల పండువగా నీల కంఠేశ్వరుని కళ్యాణం

నకరికల్లు, మార్చి8(ఆంధ్రజ్యోతి): కుంకలగుంటలో ఉన్న గంగా భ్రమరాంబ సమేత నీల కంఠేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామివార్ల కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరైయ్యారు. కళ్యాణం అనంతరం అన్నదానం చేశారు. పూజా కార్యక్రమాలను పత్రి లింగారావు నిర్వహించారు. డాక్టర్ యరగూటి సాంబశివారెడ్డి, కనుమూరి సాంబశివరావు, యరగూటి రోసిరెడ్డి దంపతులు కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి, లక్ష తమలపాకుల పూజ చేస్తున్న దంపతులు

వైభవంగా ప్రసన్నాంజనేయ స్వామి జయంతి

● ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు

రాజుపాలెం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకులగణపవరం గ్రామంలో ఉన్న ప్రసన్నాంజనేయస్వామి 96వ జయంతి మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమైయ్యాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సామూహిక లక్ష తమలపాకుల పూజలు, సిధూర పూజ కార్యక్రమంలో అత్యధిక మంది దంపతులు పాల్గొన్నారు. అలాగే స్వామివారి కోవెల విడిది, కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్‌ప్రభలు భక్తులను ఆకట్టుకున్నాయి. చక్కభజన, భక్త చింతామణి, మ్యూజికల్ నైట్ వంటి సంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

గుండెపోటుతో భక్తుడు మృతి

రాజుపాలెం,మార్చి8(ఆంధ్రజ్యోతి): పల్నాటి తిరుమలగా పేరుగాంచిన మండలంలోని దేవరంపాడు కొండపై ఉన్న మత్స్యావతార వేంకటేశ్వరస్వామి తిరునాళ్లకు విచ్చేసిన ఓ భక్తుడు గుండెపోటుతో మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. దుర్గి మండలం ఓబులేసునపల్లి గ్రామానికి చెందిన కాసుల సుబ్బారావు(53) ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలో నిల్చున్నాడు. అకస్మాత్తుగా గుండెనొప్పి రావటంతో కిందపడిపోయాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న సత్తెనపల్లి రూరల్ సీఐ ఎంవి సుబ్బారావు, రాజుపాలెం, నకరికల్లు ఎస్ఐలు వేణుగోపాల్, సురేష్‌లు వేంటనే స్పందించి సుబ్బారావును 108వాహనంలో పిడుగురాళ్ల హస్పిటల్‌కు తరలించారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సుబ్బారావు మృతి చెందాడు.

సోడా బండి తిరగబడి యువకుడి మృతి ..

నకరికల్లు మండలం గుళ్లపల్లి గ్రామానికి చెందిన షేక్ సలాం (29) శనివారం సోడాలు అమ్ముకునేందుకు గుళ్లపల్లి గ్రామం నుంచి దేవరంపాడు కొండకు బయల్దేరాడు. మార్గమధ్యలోని దేవరంపాడు సమీపంలోకి వచ్చేసరికే సోడా బండి అదుపుతప్పి పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సోడా బండి పైన పడటంతో సలాం మృతి చెందాడు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ వేణుగోపాల్ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

దాచేపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తంగెడ గ్రామంలో అటవీ భూముల్లో గుర్తు తెలియని మహిళ అస్థిపంజరాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు తెలిపారు. శనివారం తంగెడ గ్రామంలో హైస్కూల్ వెనుక అటవీ భూములకు చెందిన బీడు భూముల్లో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆధారాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా సాధికారిత బీజేపీ తోనే సాధ్యం

రెంటచింతల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారిత బీజేపీతోనే సాధ్యమని బీజేపీ నియోజకవర్గ నేత పోకూరి కాశిపతి అన్నారు. మండల కేంద్రమైన రెంటచింతలలో శనివారం నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ మహిళా రిజర్వేషన్ బిల్లు కల్పించి చట్టసభల్లో మహిళలకు సమన్యాయం చేశారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు నాగిరెడ్డి, సురేష్‌బాబు, చెన్నకేశవులు, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

షిరిడీ సాయి మందిర్‌లో ప్రత్యేక పూజలు

పిడుగురాళ్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షిరిడీ సాయి మందిరం 26వ వార్షికోత్సవం సందర్భంగా రెండో రోజు శనివారం రమా సహిత సత్యనారాయణస్వామి వ్రతం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఆలయ చైర్మన్ శ్రీరామ్ వెంకట శ్రీనివాసరావు సత్యవతి దంపతులతో పాటు పలువురు మహిళలు, భక్తులు పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు వల్లూరి వాసు దేవశర్మ, కారంపూడి కృష్ణకిషోర్, తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు.

నిఘా నేత్రంలో ముటుకూరు

● తిరునాళ్ల నేపథ్యంలో గ్రామంలో 20 సీసీ కెమెరాలు ఏర్పాటు

దుర్గి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముటుకూరులో ఆదివారం శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్లను పురస్కరించుకొని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సుధీర్‌కుమార్ 20 సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా శనివారం ఎస్ఐ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ తిరునాళ్లలో ప్రతి ఒక్కరి కదలికలను సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తామని, ఎవరైనా దురుసుగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కారంపూడి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన బైకు మెకానిక్, కౌలు రైతు పెనుగొండ్ల బ్రహ్మయ్య ఇటీవల అప్పులబాధతో ఆత్మహత్య చేసుకొని మరణించారు. విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు శనివారం బ్రహ్మయ్య గృహానికి చేరుకొని మృతుని కుటుంబసభ్యులకు రూ.20 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మునుగోటి సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్, మండల మాజీ అధ్యక్షుడు చప్పిడి రాము, మాజీ కోఆప్షన్ సభ్యుడు తండా మస్తాన్‌జాని తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

దుర్గి, కారంపూడి, గురజాలటౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియడంతో ఇకపై ప్రతి సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు దుర్గి, కారంపూడి, గురజాలటౌన్ తహసీల్దార్లు ఫణీంద్రకుమార్, వెంకటేశ్వర్లు నాయక్, నగేష్‌లు తెలిపారు. ఉదయం 10 గంటలల్లా అన్ని శాఖల అధికారులందరూ హాజరు కావాలని తహసీల్దార్లు ఆదేశించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రత్తిపాటి

రూ.40 లక్షల సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

చిలకలూరిపేట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట నియోజకవర్గానికి చెందిన 46 మందికి రూ.40 లక్షల విలువగల సీఎం సహాయనిధి చెక్కులను శనివారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పంపిణీ చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన అనారోగ్యంతో బాధపడే పేదలను ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం ముందుంటుందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పఠాన్ సమద్ ఖాన్, మద్దుమాల రవి, కుర్రా రత్తయ్య, గంగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ లో 111 కేసుల పరిష్కారం

చిలకలూరిపేట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 111 కేసులు పరిష్కారమయ్యాయి. అన్ని కేసులకు సంబంధించి రూ1.10 కోట్లకు పైగా పరిహారంగా చెల్లించడం జరిగింది. మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు.

నామినేటెడ్ పదవులకు గీటురాయిగా కేఎస్ఎస్

● కుటుంబ సాధికార సారధులకు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ దిశా నిర్దేశం

వినుకొండ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): వినుకొండ నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, శ్రేణులంతా కుటుంబ సాధికార సారధి కార్యక్రమాన్ని ప్రాధాన్యతగా తీసుకోవాలని పార్టీలో, ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులకు అదే గీటురాయి అని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో శనివారం నిర్వహించిన సమావేశంలో జీవీ మాట్లాడుతూ పార్టీలో కొత్తగా శ్రీకారం చుడుతున్న ఆ వ్యవస్థలో ప్రతి 60మంది ఓటర్లకు సాధికార సారధులు ఇన్‌చార్జులుగా ఉంటారని తెలిపారు. ప్రతి 60మంది ఓటర్లకు ఒక పురుషుడు, ఒక మహిళ ఇన్‌చార్జులుగా ఉండాలని తెలిపారు. తనతో సహా ముఖ్యమైన నాయకులంతా కేఎస్ఎస్ సభ్యులుగా, క్లస్టర్ యూనిట్, బూత్ కమిటీల్లో ఏదో ఒకదానికి కన్వీనర్‌గా ఉండాల్సిందేనని స్పష్టంచేశారు. కేఎస్ఎస్‌గా ఎంపికైన వారందరూ, వారికి కేటాయించిన వారి యోగక్షేమాలు చూస్తూ వారంతా పార్టీకోసం పనిచేసేలా చూడాలన్నారు. అలా చేసినవారే తర్వాత పార్టీ, నామినేటెడ్ పదవులు పొందేందుకు అర్హులవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఈనెల 20వ తేదీలోపు పూర్తిచేసి టీడీపీ ప్రధాన కార్యాలయానికి పంపిచాల్సివుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మండల పార్టీ అధ్యక్షుడు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన

మినీ గోకులాలతో రైతులకు ప్రోత్సాహం

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

రొంపిచర్ల, మార్చి 8 (ఆంధ్రజోతి): మినీ గోకులాల ద్వారా రైతులకు ప్రోత్సాహకాలు లభిస్తాయని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. మండలంలోని అచ్చయ్యపాలెం గ్రామంలో శనివారం సుమారు రూ 4.60 లక్షల వ్యయంతో నిర్మించిన రెండు గోకులాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పశుపోషకులకు రాయితీలను ప్రకటించిందన్నారు. వాటిని అభివృద్ధి చేసుకొనేందుకు సబ్సిడీతో కూడిన నగదు అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామ ఉప సర్పంచ్‌గా ఎంపికైన గాడిపర్తి సత్యనారాయణను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో పులుకూరి జగ్గయ్య, మందలపు వెంకటరావు, ఘంటా హనుమప్రసాదు పాల్గొన్నారు.



మినీ గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



మహిళా దినోత్సవంలో మహిళలతో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు



ఏంఎంవీఐ సీహెచ్ మనీషాను సన్మానిస్తున్న మహిళలు

నరసరావుపేట టౌన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. పారిశుధ్య మహిళా కార్మికులతో కలిసి రోడ్లను ఊడ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ మహిళలకు సమాన ఆస్తి హక్కును ఎన్టీఆర్ కల్పించారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు మహిళలకు ఆర్థికభరోసా కల్పించడం కోసం నాడు డ్వాక్రా పథకాన్ని తెచ్చారన్నారు. దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లను అందించడం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిచనున్నారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో...

ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా నరసరావుపేట ఎంఎల్ఎస్‌సీ అడ్వకేట్ ఫర్ లీగల్ ఏయిడ్ కౌన్సిల్ జీ మేరీబ్లెస్సీ పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా, ఛైర్మన్ షేక్ మీరావలి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. 2024-25 సంవత్సరానికి వుయ్యూరి మాధవిని ఉత్తమ మహిళా ఉద్యోగిగా ఎంపిక చేసి సత్కరించారు.

కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో...

స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలందరికీ ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు శుభాకాంక్షలు తెలిపారు. కళాశాలలోని మహిళా అధ్యాపకులు, మహిళా సిబ్బందిని సత్కరించారు.

ఏపీఎస్ ఆర్టీసీ ప్రజా రవాణా కార్యాలయంలో...

ఏపీఎస్ఆర్టీసీ ప్రజా రవాణా కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో పల్నాడు జిల్లా రవాణా అధికారి జీఎస్‌వీవీ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంవీఐ సీహెచ్ మనీషాను సత్కరించారు. కార్యక్రమంలో డీఎం బీ శ్రీనివాసరావు, డీపీటీవో ఏఎంపీ ప్రసాద్, వివిధ యూనియన్ల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఏంఎంరెడ్డి విద్యాసంస్థలలో...

స్థానిక ఏఎంరెడ్డి విద్యాసంస్థలలో జరిగిన వేడుకల్లో కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సృష్టికి మహిళ ఒక కానుక అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జునరావు, డాక్టర్ పీ భార్గవ్ భూషణ్ రావు, డాక్టర్ కే కృష్ణారెడ్డి, అకడమిక్ డీన్ కిషోర్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మీ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో...

స్థానిక కేసానుపల్లిలోని ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ప్రసాదరావు ప్రసంగించారు. కార్యక్రమంలో ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ బీ రవితేజ, అధ్యాపకలు పాల్గొన్నారు. ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన వేడుకలలో ఛైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు, డైరెక్టర్ దరువూరి శ్రావ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ సాధినేని రామారావు, వైస్ ప్రిన్సిపాల్ జె.రవిశంకర్, నవీన్, రాధిక, సితార, ఫణిబాబు పాల్గొన్నారు.

నరసరావుపేట పోస్టల్ డివిజన్ కార్యాలయంలో...

నరసరావుపేట పోస్టల్ డివిజన్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పోస్టల్ సూపరింటెండెంట్ పీ వెంకటస్వామి ఆధ్వర్యంలో పీవోఎస్‌బీ, ఎస్ఎస్ఏ, పీఎల్ఐ/ఆర్‌పీఎల్ఐ, ఐపీపీబీ కేటగిరీలలో ప్రతిభ చూపించిన మహిళా ఉద్యోగులను సన్మానించారు. ప్రత్యేక కాంటెస్ట్‌లో ప్రతిభ చూపించి న మహిళా ఉద్యోగులను జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ మీరాజ్ ఫాతిమా, ఇన్‌స్పెక్టర్లు యాదగిరి, సురేష్, కోటేశ్వరరావు, ప్రసాద్, అశోక్, నరసరావుపేట డివిజన్ పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.



సత్కరించిన మహిళా ఉద్యోగులతో పోస్టల్ సూపరింటెండెంట్ వెంకటస్వామి తదితరులు

ఎన్ఈసీలో రక్తదాన శిబిరం

నరసరావుపేట లీగల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పల్నాడు జిల్లా రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్, కలెక్టర్ అరుణ్‌బాబు సూచనల మేరకు ఈ శిబిరం నిర్వహించినట్లు రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. శిబిరాన్ని ముఖ్య అతిథిగా జాయింట్ కలెక్టర్ సతీమణి అదితి డాకు ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల నిర్వాహకులు వెంకట కోటేశ్వరరావు, మురళీకృష్ణ, డాక్టర్ సృజన, డాక్టర్ రహంతుల్లా, రెడ్‌క్రాస్ సభ్యులు, ఎన్ఎస్ఎస్ అధికారి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్: మండలంలోని వివిధ ప్రాంతాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండలంలోని తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో వక్తలు మహిళా సాధికారతపై ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ, పద్మావతి, అమూల్య, పలువురు మహిళా అధ్యాపకులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా సర్వే నిర్వహించాలి

నాదెండ్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పీ-4 సర్వేను నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఎంపీడీవో ఎస్ స్వరూపరాణి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆర్థిక స్థితిగతులపై ప్రభుత్వం నిర్వహిస్తున్న పీ - 4 సర్వేను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాదెండ్లలో జరుగుతున్న సర్వేను ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యదర్శి ఎంవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



సర్వే తీరును పరిశీలిస్తున్న ఎంపీడీవో స్వరూపరాణి

మహిళల కోసం చంద్రబాబు పదింతల కృషి

● ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ



టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి మహిళలకు పంపిణీ చేస్తున్న జీవీ

వినుకొండటౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జ్యోతిరావుపూలే, ఎన్టీఆర్ బాటలో రాష్ట్రంలో మహిళా సాధికారత కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు పదింతలు కృషి చేస్తున్నారని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మహిళలు, ఉపాధ్యాయులు, ఉద్యోగులతో కలిసి శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి అందరికి పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని ప్రగతిపథంలో ముందుకు సాగిస్తున్నారని, మహిళ సాధికారత, వారి రక్షణ టీడీపీ సిద్ధాంతాల్లో ఒకటన్నారు. కార్యక్రమంలో మాజీ ఎ మ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మహిళాప్రతినిధులు, తెలుగు మహిళలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

● వినుకొండ: ఎన్‌డీఏ ప్రభుత్వ హయాంలో మహిళలకు పూర్తి రక్షణ కల్పిస్తున్నామని మహిళాసాధికారతకు సీఎం చంద్రబాబు పెద్దపీట వేశారని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ అన్నారు. నరసరావుపేట రోడ్డులోని గంగినేని కల్యాణమండపంలో గీతాంజలి 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన, ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూషసుబ్బారావు, గీతాంజలి విద్యాసంస్థల డైరెక్టర్ వైశేషగిరిరావు, కరస్పాండెంట్ లక్ష్మణ్‌కిషోర్, ప్రిన్సిపాల్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

● వినుకొండలోని స్ఫూర్తి టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తపేటలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా టైలర్లను సన్మానించారు.

పద్మశాలి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

పట్టణంలోని దక్షిణం బజారులో భద్రావతి సమేత భావనారుషిస్వామి దేవస్థానం నందు పద్మశాలి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పల్నాడు ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పాముల హనుమంతరావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో ఇటీవల ఎస్ఐగా ఎంపికైన అవ్వారు లక్ష్మీ, తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అనుముల ప్రసాద్, అవ్వారు కోటేశ్వరరావు, అపర్ణ, సాగర్, తుమ్మా శ్రీనివాసరావు, చేపూరి రమేష్, నీలితులసీరామ్, అవ్వారు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బొల్లాపల్లి మండలంలో...

బొల్లాపల్లి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరు వాసవి క్లబ్ వైభవ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లను సన్మానించారు. వాసవి క్లబ్ వైభవ్ అధ్యక్షులు గజ్వేలి సుబ్బయ్య, అర్వపల్లి సుబ్రహ్మణ్యం, మేడం శ్రీను, దేసు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

నాదెండ్ల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం, నాదెండ్ల గ్రామాల పరిధిలోని కొత్తగా నిర్మించిన బైపాస్‌కు ఏర్పాటుచేసిన సోలార్ కేబుల్ చోరీకేసులో నాదెండ్ల పోలీసులు శనివారం ఒకరిని అరెస్టు చేశారు. మంగళగిరికి చెందిన అనుమోలు వాసు అనే వ్యక్తిని అరెస్టుచేసి కోర్టుకు హాజరుపర్చారు. మిగిలిన వారికోసం గాలిస్తున్నట్టు ఎస్ఐ పుల్లారావు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

రొంపిచర్ల, మార్చి 8(ఆంధ్రజోతి): మండలంలోని రెడ్డిపాలెం సమీపంలో రేషన్‌బియ్యాన్ని పోలీసులు శనివారం పట్టుకున్నారు. అందిన సమాచారం మేరకు ఎస్ఐ మణికృష్ణ సంఘటనా స్థలానికి సిబ్బందితో వెళ్ళారు. అశోక్ లేలాండ్ వాహనంలో తరలిస్తున్న 35 క్వింటాళ్ళ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. రేషన్ బియ్యం సమాచారాన్ని రెవెన్యూ అధికారులకు తెలియ పరిచారు.

ఇద్దరు ఎమ్మార్వోలపై కూటమి నేతల ఫిర్యాదు

నర్సరావుపేట లీగల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట, రొంపిచర్ల తహసీల్దార్‌లు వేణుగోపాల్, నిర్మలపై కూటమినేతలు శనివారం పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబుకు ఫిర్యాదు చేశారు. సదరు ఫిర్యాదులపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేను ఆదేశించారు. ఇటీవల ఈ ఇరువురు ఎమ్మార్వోలపై స్థానిక రైతుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయి.

జాతీయ లోక్ అదాలత్‌లో 197 కేసుల పరిష్కారం

జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయసేవ అధికారుల సంస్థల ఆదేశాల మేరకు శనివారం స్థానిక న్యాయస్థానం ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. అదాలత్‌లో సివిల్, క్రిమినల్, చెక్కుబౌన్స్ కేసులు, మోటార్ వాహన ప్రమాదకేసులు, మనోవర్తి తదితర 197 కేసులను పరిష్కరించారు. స్థానిక మండల న్యాయసేవ అధికార సంస్థ ఛైర్మన్ 13వ అదనపు జిల్లా న్యాయధికారి నేతి సత్యశ్రీ నేతృత్వంలో న్యాయాధికారులు కేసులను పరిష్కరించారు. పరిష్కారమైన కేసుల్లో కక్షిదారులకు రూ.కోటి 87లక్షల 93వేల 612 మేరకు లబ్ధి చేకూరింది. అదాలత్‌లో న్యాయవాదులు బీ సలీం, హరీష్‌కుమార్, హనుమంతరావు, సునీల్‌సింగ్, చక్రపాణి, అమూల్య, కిరణ్ తేజ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ నూతన బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట టౌన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఆర్టీసీ డిపోలో కొత్త బస్సును ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు రిబ్బన్‌కట్ చేసి శనివారం ప్రారంభించారు. నరసరావుపేట నుంచి గుంటూరు వెళ్లేందుకు నూతనంగా నాన్‌స్టాప్ బస్సును ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

స్థానిక టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శనివారం పంపిణీచేశారు. 30మంది లబ్ధిదారులకు రూ.37,48,000 విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి వైద్యపరంగా సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం

స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో టాటా కేపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ సహకారంతో శంకర కంటి వైద్యశాల సిబ్బంది కంటి వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. పల్నాడు జిల్లా అంధత్వ నివారణ సంస్థ డీపీఎం ఏ భువనేశ్వరి మాట్లాడుతూ కంటి ఆరోగ్యాన్ని ఏలా కాపాడుకోవాలో తెలియజేశారు. శంకర కంటి వైద్యశాల సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, ప్రిన్సిపాల్ ఎంఎస్ సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ పీ శ్రీనివాససాయి, కంటి వైద్యశాల డాక్టర్ శ్యామ్ దీప్, గంగాధర్, ఎన్‌సీసీ అధికారి బీఎస్ఆర్‌కే రాజు, టాటా హౌసింగ్ ఫైనాన్స్ నుంచి సతీష్ కుమార్, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్యామ్, పక్కన మున్సిపల్ మాజీ ఛైర్మన్ సుబ్బరాయగుప్తా తదితరులు

వినుకొండలో చైన్ స్నాచింగ్

వినుకొండటౌన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మహిళా మెడలో బంగారపు గొలుసు లాక్కెళ్లిన సంఘటన పట్టణంలోని మెయిన్ బజార్ వివేకానంద పాఠశాల సమీపంలో శనివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. ఇంటిముందు కసువు చిమ్ముతున్న భానుమతి అనే మహిళ మెడలో బంగారపు గొలుసు లాక్కొని ఓ వ్యక్తి పరారయ్యాడు, ఇదే సమయంలో మెడలోని గొలుసు సగం దొంగచేతిలో ఉండగా, మరో సగం భానుమతి చేతిలో ఉన్నట్లు బాధితురాలు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే ఎస్టీయూ లక్ష్యం

శావలాపురం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా ఎస్టీయూ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం పనిచేస్తుందని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి చంద్రజిత్ యాదవ్ తెలిపారు. శావల్యాపురం మండల ఎస్టీయూశాఖ ఆధ్వర్యంలో స్థానిక మానవ విద్యావనరుల కేంద్రంలో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లను ఎంఈవో మద్దికుంట సాంబశివరావుకు శనివారం అందచేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షులు కొండ్రముట్ల వెంకటరత్నం, మండల కార్యదర్శి బిల్లా రాజారమేష్, సీఆర్‌పీ రావూరి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

యడ్లపాడు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పుటిగంపు సరిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన హెచ్‌సీజీ క్యాన్సర్ హాస్పటల్, గుంటూరు హెల్త్‌కేర్ హాస్పిటల్స్ సహకారంతో ఉచిత క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధుల స్క్రీనింగ్ పరీక్షలు ఆదివారం నిర్వహిస్తున్నారు. యడ్లపాడులోని నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్‌నందు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. పాప్‌స్మియర్, పీఎస్ఏ, సీఏ125 క్యాన్సర్ పరీక్షలతోపాటు ఈసీజీ, టూడి ఎకో, షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు పుటిగంపు వెంకటేశ్వరరావు తెలిపారు.

ఆటోను ఢీకొన్న గుర్తుతెలియని వాహనం - ఆరుగురికి గాయాలు

వ్యవసాయకూలీలతో వెళుతున్న ఆటోను గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఢీకొంది. 16వ నంబరు జాతీయరహదారిపై ఉప్పువాగు సమీపంలో శనివారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో ఆరుగురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. శనివారం ఉదయం యడ్లపాడు నుంచి వ్యవసాయ కూలీలను ఎక్కించుకుని జాతీయరహదారి మీదుగా తిమ్మాపురం వైపు ఆటో బయలుదేరింది. ఉప్పువాగు సమీపంలోకి రాగానే అదే మార్గంలో గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపు వెళుతున్న వాహనం ఆటోను ఢీకొట్టింది. ఆటోలోని ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని చిలకలూరిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం ఐదుగురిని నరసరావుపేటలోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు విచారిస్తున్నారు.

స్పందనకు అధికారులంతా హాజరుకావాలి...

ఈపూరు, మార్చి 8(ఆంధజ్యోతి): స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్‌కు అన్ని ప్రభుత్వశాఖల అధికారులు హాజరుకావాలని తహసీల్దారు ఏ నళిని శనివారం చెప్పారు. ప్రజలు ఆయా శాఖలకు సంబంధించిన సమస్యలను అధికారులకు తెలియజేసి పరిష్కరించుకోవచ్చునన్నారు.

మండల స్థాయిలోనే ప్రజా సమస్యల పరిష్కారం

నూజెండ్ల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రమేష్ కుమార్ శనివారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి రెవెన్యూ కార్యాలయంలో అర్జీలు స్వీకరించి పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో రేపు గ్రీవెన్స్

యడ్లపాడు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గత నెల రోజులుగా నిలిచిపోయిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) కార్యక్రమాన్ని సోమవారం తిరిగి నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విజయశ్రీ తెలిపారు. మండలస్థాయి అధికారులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని, సమస్యలపై ప్రజలు అర్జీలు అందచేయవచ్చని పేర్కొన్నారు.

అసిస్ట్, ఐటీసీ సంస్థల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

చిలకలూరిపేట, మార్చి8(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రముఖ సేవా సంస్థ అసిస్ట్, ఐటీసీ సంస్థల ఆధ్వర్యంలో పట్టణంలోని అసిస్ట్ సంస్థలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ అధినేత డాక్టర్ జాష్టి రంగారావు, అసోసియేట్ డైరెక్టర్లు జె.కృష్ణహరీష్, ఎం విష్ణుప్రియ పాల్గొన్నారు. మిత్ర సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కందిమల్ల జయమ్మను ఘనంగా సత్కరించారు.